# మనం

## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, జోగులాంబ గద్వాల, నారాయణ పేట, వనపర్తి

శుక్రవారం | 23 | అక్టోబర్ | 2026 | పేజీలు 13 | www.manamepaper.com




## కొడంగల్‌లో సీఎం రేవంత్‌రెడ్డికి ఘన స్వాగతం

### నారాయణపేట కలెక్టర్ ప్రియాంక పుష్పగుచ్ఛంతో ఆహ్వానం

నారాయణపేట అక్టోబర్ 22 (మనం న్యూస్) : రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి గురువారం కొడంగల్ పర్యటనకు విచ్చేసిన సందర్భంగా నారాయణపేట జిల్లా కలెక్టర్ సిహెచ్. ప్రియాంక పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. కొడంగల్‌లోని హెలిప్యాడ్ వద్ద జిల్లా కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులు ముఖ్యమంత్రికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకొని కలెక్టర్ ప్రియాంక ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



## సాయన్న జీవితం సామాజిక చైతన్యానికి ప్రతీక

### మహనీయుల ఆశయాలను భావితరాలకు అందించవలసిన బాధ్యత మనది

### నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్

**నాగర్ కర్నూల్ జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో గురువారం పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.**

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 22 (మనం బ్యూరో) : ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సమాజంలో ధైర్యసాహసాలకు, ప్రజల పట్ల నిబద్ధతకు, సామాజిక చైతన్యానికి ప్రతీకగా నిలిచిన మహనీయుల జీవిత చరిత్రలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని సూచించారు. సమాజ శ్రేయస్సు కోసం కృషి చేసిన వారి సేవలను

- మిగతా 2లో..



### వాల్టా చట్టాన్ని పకడ్బందీగా

## అమలు చేయాలి

**40 శాతం వర్షపాత లోటు..**

**ఎల్‌నినో ప్రభావంతో పడిపోతున్న భూగర్భ జలమట్టాలు**

**యాసంగిలో వరి సాగుకు స్వస్తి పలికి ఆరుతడి పంటలకే ప్రాధాన్యం ఇవ్వాలి**

**అనుమతులు లేకుండా బోర్లు తవ్వితే కఠిన చర్యలు..**

**రిగ్గుల జప్తు, క్రిమినల్ కేసులు**

**జిల్లా కలెక్టర్ సిహెచ్. ప్రియాంక**

2

జిల్లాలో నెలకొన్న వర్షపాత లోటు, ఎల్-నినో ప్రభావం నేపథ్యంలో భూగర్భ జలాల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సిహెచ్. ప్రియాంక సూచించారు. భూగర్భ జలమట్టాలు తీవ్రంగా పడిపోతున్న పరిస్థితుల్లో నీటి వనరులను సంరక్షించేందుకు వాల్టా చట్టం నిబంధనలను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

## ప్రజా పాలనలో పల్లెల సమగ్ర ప్రగతి

**అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ**

**తిర్మాలపూర్‌లో రూ. 20 లక్షలతో పంచాయతీ భవన నిర్మాణానికి భూమిపూజ**

**సొంత భవనం లేని ప్రతి పంచాయతీకీ నిధుల మంజూరు**

**పనులను వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశం**



ఉప్పునుంతల, అక్టోబర్ 22 (మనం న్యూస్) : రాష్ట్రంలో ప్రజా పాలన ప్రభుత్వ హయాంలో పల్లెల సమగ్ర ప్రగతే ధ్యేయంగా అడుగులు పడుతున్నాయని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని తిర్మాలపూర్ గ్రామంలో

- మిగతా 2లో..

# వాల్టా చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాలి

నారాయణపేట అక్టోబర్ 22 (మనం న్యూస్): భూగర్భ జలాల వినియోగం, కొత్త బోర్ల తవ్వకాలు, అనుమతుల జారీ విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గురువారం ఈ అంశంపై కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు 40 శాతం వర్షపాత లోటు నమోదవడం, ఎల్-నినో ప్రభావం కారణంగా భూగర్భ జలమట్టాలపై తీవ్ర ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో భూగర్భ జలాలపై ఆధారపడే రైతులు, ప్రజలు నీటి కొరతను ఎదుర్కొనే పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న భూగర్భ జలాలను విచ్చలవిడిగా వినియోగించకుండా, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని పొదుపుగా వాడుకోవాలని సూచించారు.

**యాసంగిలో వరి సాగుకు దూరంగా ఉండాలి..**

ప్రస్తుత పరిస్థితుల్లో వ్యవసాయ రంగంలో నీటి వినియోగాన్ని తగ్గించాల్సిన అవసరం ఉందని కలెక్టర్ పేర్కొన్నారు. ముఖ్యంగా రానున్న యాసంగి (రబీ) సీజన్‌లో రైతులు వరి సాగును పూర్తిగా నిలిపివేసి, తక్కువ నీటితో సాగు చేయగల ఆరుతడి పంటలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. భూగర్భ జలాలపై అధికంగా ఆధారపడే పంటల సాగు వల్ల నీటి నిల్వలు మరింత తగ్గిపోయే ప్రమాదం ఉందని వివరించారు. నీటి లభ్యతకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవడం ద్వారా భూగర్భ జలాలను కాపాడుకోవడంతోపాటు భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తకుండా నివారించవచ్చని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ, భూగర్భ జల శాఖ అధికారుల సాంకేతిక సూచనలు పాటిస్తూ పంటల సాగుపై నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.

**భూగర్భ జల శాఖదే సాంకేతిక పరిశీలన బాధ్యత..**

జిల్లాలో భూగర్భ జలాల లభ్యత, కొత్త బోర్ల తవ్వకాలకు సంబంధించిన సాధ్యాసాధ్యాలను నిర్ధారించడంలో భూగర్భ జల శాఖ కీలక సాంకేతిక సంస్థగా వ్యవహరిస్తుందని కలెక్టర్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాల పరిస్థితిని పరిశీలించి, సాంకేతిక నివేది ఒకల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. భూగర్భ జల శాఖ అందించే సాంకేతిక నివేదికల ఆధారంగా సంబంధిత తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు క్షేత్రస్థాయిలో నిబంధనల అమలును పర్యవేక్షించాలని సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో భూగర్భ జలాల వినియోగం, కొత్త బోర్ల తవ్వకాలపై నిరంతరం నిఘా ఉంచాలని తెలిపారు. వాల్టా చట్టం నిబంధనలను ఉల్లంఘించకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.

**అనుమతులు లేకుండా బోర్లు తవ్వితే చర్యలు..**

వాల్టా చట్టం నిబంధనల ప్రకారం సంబంధిత అనుమతులు లేకుండా కొత్త బోర్లు తవ్వడం చట్టవిరుద్ధమని కలెక్టర్ స్పష్టం చేశారు. సమర్థ వాల్టా అథారిటీ అయిన తహశీల్దార్ నుంచి అవసరమైన అనుమతులు పొందడంతోపాటు, భూగర్భ జల శాఖ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌ఓసీ) తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా బోర్లు తవ్వే వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా రక్షిత మంచినీటి వనరుల పరిరక్షణకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. వాల్టా నిబంధనల ప్రకారం రక్షిత మంచినీటి వనరులకు 250 మీటర్ల పరిధిలో కొత్త బోర్లు తవ్వడం పూర్తిగా నిషేధమని తెలిపారు. ప్రజలకు తాగునీరు అందించే వనరులు కలుషితం కాకుండా, వాటి నీటి లభ్యత తగ్గిపోకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**అక్రమ బోర్ల తవ్వకాలపై నిఘా..**

అనుమతులు లేకుండా బోర్లు తవ్వే వారిపై కఠినంగా వ్యవహరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. తహశీల్దార్లు, మున్సిపల్ కమిషనర్ల పర్యవేక్షణలో అక్రమ బోర్ల తవ్వకాలను గుర్తించి, వాల్టా చట్టం ప్రకారం చర్యలు చేపట్టాలని ఆదేశించారు. నిబంధనలను ఉల్లంఘించి తవ్వకాలు చేపట్టే రిగ్గులను జప్తు చేసే చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్రమ తవ్వకాలకు పాల్పడే వారిపై విద్యుత్ కనెక్షన్ల రద్దు, క్రిమినల్ కేసుల నమోదు వంటి చర్యలతోపాటు, నిబంధనల ప్రకారం భారీ పర్యావరణ నష్టపరిహార రుసుము (ఈసీసీ) వసూలు చేస్తామని హెచ్చరించారు. భూగర్భ జలాలను అనుమతులు లేకుండా వెలికితీయడం వల్ల పర్యావరణ సమతుల్యత దెబ్బతినడమే కాకుండా, భవిష్యత్తులో తాగునీటి సమస్యలు మరింత తీవ్రతరం అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు.

**అనుమతులు, ఫిర్యాదుల కోసం సంప్రదించాలి..**

జిల్లాలో భూగర్భ జలాల పరిరక్షణకు ప్రజలు, రైతులు అధికారులకు సహకరించాలని కలెక్టర్ కోరారు. కొత్త బోర్ల తవ్వకాలకు అవసరమైన అనుమతులు, భూగర్భ జలాల లభ్యతపై సాంకేతిక సలహాలు, అక్రమ బోర్ల తవ్వకాలపై సమాచారం లేదా ఫిర్యాదుల కోసం నారాయణపేటలోని జిల్లా భూగర్భ జల శాఖ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు. భూగర్భ జలాలను కాపాడుకోవడం ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత కూడా అని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రస్తుత నీటి పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని నీటి వృథాను అరికట్టడం, భూగర్భ జలాలను పొదుపుగా వినియోగించడం, చట్ట నిబంధనలను పాటించడం ద్వారా భవిష్యత్తు తరాలకు నీటి భద్రత కల్పించవచ్చని తెలిపారు.

## సాయన్న జీవితం సామాజిక చైతన్యానికి ప్రతీక

మొదటి పేజీ తరువాయి

స్మరించుకోవడంతో పాటు, వారి జీవితాల నుంచి స్ఫూర్తి పొందాలని తెలిపారు. పండుగ సాయన్న ముదిరాజ్ చరిత్రను భావితరాలకు తెలియజేయడం ఎంతో ముఖ్యమన్నారు. ముఖ్యంగా యువత ఆయన జీవిత విశేషాలను తెలుసుకొని ధైర్యం, ఆత్మవిశ్వాసం, సేవాభావం వంటి సద్గుణాలను అలవర్చుకోవాలని సూచించారు. మహనీయుల జయంతి వేడుకలు కేవలం నివాళులర్పించే కార్యక్రమాలకే పరిమితం కాకుండా, వారి ఆశయాలను ఆచరణలో పెట్టేందుకు ప్రేరణ కల్పించాలని తెలిపారు. సమాజ అభివృద్ధికి విద్య ఎంతో కీలకమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఆర్థికాభివృద్ధి రంగాల్లో ముందుకు సాగేందుకు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం అందుపుచ్చుకోవాలన్నారు. విద్య ద్వారా సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని, ప్రతి కుటుంబం పిల్లల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. సమాజంలో సమానత్వం, ఐక్యత, పరస్పర గౌరవం పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకొని, సమాజంలోని అన్ని వర్గాల అభ్యున్నతికి సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, డిఆర్ఓ పాండు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారిని ఇందిర, డిటిడిఓ కొటయ్య, ఆర్డీవోలు అర్చన, జనార్దన్ రెడ్డి, ముదిరాజ్ సంఘం ప్రతినిధులతో పాటు తదితరులు పాల్గొని పండుగ సాయన్న ముదిరాజ్‌కు నివాళులర్పించారు.జ

## వైద్య ఆరోగ్యశాఖ పోస్టులకు 24న అర్హత పరీక్షలు

**ఈ నెల 27న. వాక్-ఇన్ ఇంటర్వ్యూలు**

**జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 22 (మనం బ్యూరో) : వైద్య ఆరోగ్యశాఖలో వివిధ పోస్టుల భర్తీకి అర్హత పరీక్షలు, వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం ఒక ప్రకటన లో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు నిర్ణీత షెడ్యూల్ ప్రకారం హాజరుకావాలని సూచించారు. వివిధ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 24వ. తేదీన అర్హత పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ల్యాబ్ టెక్నీషియన్ (సీఎస్సీయూడ యెన్ టీ ఈ పీ) పోస్టులకు ఉదయం 10:00 గంటల నుంచి 10:30 గంటల వరకు, మల్టీ పర్పస్ వర్కర్ పోస్టులకు మధ్యాహ్నం 1:00 గంటల నుంచి 1:30 గంటల వరకు, స్టాఫ్ నర్స్ పోస్టులకు మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 3:00 గంటల వరకు, ఏఎన్ఎం పోస్టులకు సాయంత్రం 4:00 గంటల నుంచి 4:30 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అభ్యర్థులు తమ పోస్టులకు కేటాయించిన సమయాన్ని గమనించి నిర్ణీత సమయానికి పరీక్షలకు హాజరుకావాలని సూచించారు. అదేవిధంగా, పల్లె దవాఖానల్లో పనిచేసేందుకు ఏం ఎల్ పీహెచ్ /సి హెచ్ ఓ /ఏంఓ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న ఎంబీబీఎస్ /బీఏఎంఎస్ అర్హత కలిగిన అభ్యర్థులకు ఈ నెల 27వ. తేదీన ఉదయం 10:30 గంటలకు వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఇంటర్వ్యూలు గద్వాల పట్టణంలోని ఐడీఓసీ భవనం మొదటి అంతస్తులో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం, ఎఫ్ -30లో నిర్వహించబడతాయని వెల్లడించారు. ప్రభుత్వ సంస్థల్లో పనిచేస్తున్న అభ్యర్థులు తమ శాఖాధిపతి నుంచి పొందిన నిరభ్యంతర పత్రం తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. ఇదిలా ఉండగా, ఏం ఎల్ పీహెచ్ /సి హెచ్ ఓ /ఏంఓ (పల్లె దవాఖాన), ఫిజీషియన్, ఫిజియోథెరపిస్ట్, ఓబీజీ స్పెషలిస్ట్, పీజీ అర్హత కలిగిన ఆయుష్ వైద్యులు, డైటీషియన్, సైకోసోషల్ కౌన్సిలర్, యోగా ప్రొఫెషనల్, సీనియర్ ట్యూబర్క్యులోసిస్ లాబొరేటరీ సూపర్‌వైజర్ తదితర పోస్టులకు సంబంధించిన మెరిట్ జాబితాలను జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు తమ పేర్లు, దరఖాస్తు వివరాలు, మెరిట్ జాబితాలోని సమాచారాన్ని అధికారిక వెబ్‌సైట్‌లో పరిశీలించి ధృవీకరించుకోవాలని సూచించారు. అభ్యర్థులు పరీక్షలు, ఇంటర్వ్యూలకు హాజరయ్యే ముందు సంబంధిత సూచనలను జాగ్రత్తగా చదివి, అవసరమైన ధ్రువపత్రాలను సిద్ధం చేసుకోవాలని అధికారులు తెలిపారు. పరీక్షలు, ఇంటర్వ్యూల తేదీలు, సమయాలు, మెరిట్ జాబితాలు, ఇతర వివరాల కోసం జిల్లా అధికారిక వెబ్‌సైట్‌ను https://gadwal.telangana.gov.in/ సందర్శించాలని సూచించారు.

## ప్రజా పాలనలో పల్లెల సమగ్ర ప్రగతి

మొదటి పేజీ తరువాయి

రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన గ్రామ పంచాయతీ భవనానికి ఆయన స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేసి, భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ, గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్న ఆలోచనతో ప్రభుత్వం గ్రామ స్వరాజ్యానికి పెద్దపీట వేస్తోందన్నారు. నియోజకవర్గ పరిధిలో పంచాయతీ భవనాలు లేని ప్రతి గ్రామానికి పంచాయతీరాజ్ నిధులను సమకూర్చి, నూతన పక్కా భవనాలను నిర్మించే బాధ్యతను తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే జాతీయ ఉపాధి హామీ పథకం కింద తిర్మాలపూర్‌లో రూ. 20 లక్షల అంచనా వ్యయంతో సకల మౌలిక వసతులతో కూడిన నూతన భవన నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. గ్రామ ప్రజలకు అన్ని పాలనా సేవలు ఒకే చోట సులభంగా అందేలా వీటిని తీర్చిదిద్దుతున్నామన్నారు. నిర్మాణ పనులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా త్వరితగతిన ప్రారంభించి, నాణ్యతా ప్రమాణాలతో గడువులోగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కొరత లేకుండా చూసేందుకు నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిర్మాలపూర్ గ్రామ సర్పంచ్ బరిగెల శ్రీకాంత్, ఉప్పునుంతల సర్పంచ్ చింతగాళ్ళ శ్రీనివాసులు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లారెడ్డి, సీనియర్ నాయకులు తిప్పర్తి నరసింహారెడ్డి, వేముల నరసింహారావు, గోపిరెడ్డి రఘుపతిరెడ్డి, స్థానిక నాయకులు తిప్పర్తి బాల్‌రెడ్డి, సదానందం ఆచారి, శేఖర్ యాదవ్, రాఘవరెడ్డి, యాదవరెడ్డి తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ యువజన కమిటీ ఎన్నిక

సంస్థాన్ నారాయణపురం, అక్టోబర్ 22, మనం న్యూస్: మండలంలోని వాయిలపల్లి గ్రామ బి ఆర్ ఎస్ యువజన సంఘం ఎన్నికను బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నరి నరసింహ అధ్యక్షతన ఎన్నుకున్నారు. యువజన అధ్యక్షులుగా బొమ్మకంటి సంజీవ, ఉపాధ్యక్షులుగా వనం చెందు, ప్రధాన కార్యదర్శిగా నారగోని ప్రసాద్ లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కర్తి పాపయ్య, మాజీ ఎంపీటీసీ దోటి జంగయ్య, వనం స్వామి, గుండెపంగా మహేష్, దోటి నరసింహా, జింకల యాదయ్య, గూని స్వామి, గుండపంగా మల్లేష్, పులకరం నరసింహ

# నరసింహారెడ్డి కుటుంబానికి ఎమ్మెల్యే వంశీకృష్ణ పరామర్శ

**చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి**

**కుటుంబానికి అండగా ఉంటామని భరోసా**



ఉప్పునుంతల, అక్టోబర్ 22: (మనం న్యూస్) : మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన తిప్పర్తి నరసింహారెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందడం తీవ్ర దిగ్భ్రాంతికరమని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పేర్కొన్నారు. గురువారం తిర్మలాపూర్‌లోని నరసింహారెడ్డి స్వగృహంలో నిర్వహించిన సంతాప కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం తీవ్ర శోకంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. రోడ్డు ప్రమాదంలో కుటుంబ పెద్దను కోల్పోవడం అత్యంత బాధాకరమని, వారి కుటుంబానికి పార్టీ పరంగా, వ్యక్తిగతంగా అన్ని విధాలా అండగా ఉంటామని ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో తిర్మలాపూర్ గ్రామ సర్పంచ్ బరిగెల శ్రీకాంత్, ఉప్పునుంతల సర్పంచ్ చింతగాళ్ళ శ్రీనివాసులు, మామిళ్ళపల్లి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ కమిటీ చైర్మన్ వేముల నరసింహారావు, మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ మరియు అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మల్లారెడ్డి, కంసానిపల్లి మాజీ ఎంపీటీసీ గోపిరెడ్డి అనూరాధ రఘుపతి రెడ్డి పాల్గొన్నారు. అలాగే స్థానిక నాయకులు తిప్పర్తి బాల్‌రెడ్డి, నందనాచారి, శేఖర్ యాదవ్, సుభాష్ రెడ్డి, యాదవ రెడ్డితో పాటు తదితరులు హాజరై నివాళులు అర్పించారు.



# పండుగ సాయన్నకు ఘనంగా నివాళి

**బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి.. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యెన్నం**

మహబూబ్‌నగర్, అక్టోబర్ 22 (మనం ప్రతినిధి) : బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన ధీరుడు పండుగ సాయన్న అని ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి కొనియాడారు. పండుగ సాయన్న 174వ జయంతి సందర్భంగా గురువారం మహబూబ్‌నగర్‌లోని పద్మావతి కాలనీ గ్రీన్‌బెల్ట్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా యెన్నం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, నిజాం ప్రభుత్వ హయాంలో భూస్వాములు, దొరల అరాచకాలకు వ్యతిరేకంగా పండుగ సాయన్న పోరాటం సాగించారని గుర్తుచేశారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం ఆయన విశేషంగా కృషి చేశారని పేర్కొన్నారు. అణగారిన వర్గాల ప్రజల పక్షాన నిలిచిన పండుగ సాయన్న, తెలంగాణ రాబిన్‌హుడ్‌గా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. పండుగ సాయన్న పోరాట స్ఫూర్తి, సామాజిక స్పృహ నేటి యువతకు మార్గదర్శకంగా నిలవాలని ఆకాంక్షించారు. సమాజంలో సమానత్వం, సామాజిక న్యాయం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, జిల్లా రెవెన్యూ అధికారి ఏ. నిర్మల, బీసీ సంఘాల నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌సీసీ ఇన్‌స్ట్రక్టర్ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

**గురుకులాల్లో ఖాళీలు.. అర్హులైన అభ్యర్థులకు అవకాశం**

మహబూబ్ నగర్ , అక్టోబర్ 22 (మనం ప్రతినిధి ): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గురుకుల విద్యాసంస్థల్లో ఎన్‌సీసీ పీఈటీ విభాగాల్లో పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నాగర్‌కర్నూల్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (పురుషులు), నాగర్‌కర్నూల్ ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. నాగర్‌కర్నూల్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల (పురుషులు), తిరుమల హిల్స్, అప్పన్నపల్లి గ్రామ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల్లో ఎన్‌సీసీ, పీఈటీ సిబ్బంది నియామకానికి చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. మాజీ సైనికులు, గ్రాడ్యుయేట్ ఎన్‌సీసీ 'సి', కనీసం బి సర్టిఫికెట్ కలిగిన అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు విద్యార్హతల సర్టిఫికెట్లను ఒరిజినల్స్‌తో సహా ఒక సెట్ జిరాక్స్ కాపీలను జతచేసి సమర్పించాలని సూచించారు. ఈ నెల 24వ తేదీన తిరుమల హిల్స్, అప్పన్నపల్లి, నాగర్‌కర్నూల్‌లోని సంబంధిత గురుకుల విద్యాసంస్థల్లో ఉదయం 11 గంటలకు వాక్-ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.20,000 గౌరవ వేతనం చెల్లించనున్నట్లు వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం 7901097703, 7901097704 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# బీబీఎస్ సాధించిన పేదింటి బిడ్డకు 'మర్యాద ఫౌండేషన్' ఆసరా

**విద్యార్థిని జంపుల విద్యకు ఆర్థిక సాయం అందజేత**

**హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు, కుటుంబ సభ్యులు**



ఉప్పునుంతల, అక్టోబర్ 22 (మనం న్యూస్) : కటిక పేదరికం వెక్కిరిస్తున్నా పట్టువదలని సంకల్పంతో శ్రమించి వైద్య విద్యకు ఎంపికైన గ్రామీణ విద్యార్థినికి మేమున్నామంటూ 'మర్యాద ఫౌండేషన్' ఆసరాగా నిలిచింది. మండల కేంద్రమైన ఉప్పునుంతలకు చెందిన నిరుపేద కుటుంబానికి చెందిన చదువుల తల్లి జంపుల విద్య ఇటీవల విడుదలైన జాతీయ స్థాయి నీట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రతిష్టాత్మక ఎంబీబీఎస్ సీటును కైవసం చేసుకుంది. ఎంతో ప్రతిభ ఉండి, వైద్య విద్యను అభ్యసించాలనే దృఢ సంకల్పం ఉన్నప్పటికీ ఆర్థిక ఇబ్బందులు ఆటంకంగా మారిన తరుణంలో 'మర్యాద ఫౌండేషన్' సభ్యులు వెంటనే స్పందించారు. విద్య ఉన్నత చదువులకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ఫౌండేషన్ సభ్యులు గురువారం ఆమె కుటుంబ సభ్యులను కలిసి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి సమాజానికి సేవ చేయాలనే లక్ష్యంతోనే తమ వంతుగా ఈ తోడ్పాటును అందించినట్లు తెలిపారు. డాక్టర్ కావాలనే విద్య కల నెరవేరాలని, భావి జీవితంలో ఆమె మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. కష్టకాలంలో చదువుల తల్లికి చేదోడువాదోడుగా నిలిచి ఆర్థిక సాయం అందించిన 'మర్యాద ఫౌండేషన్' ప్రతినిధులకు విద్య కుటుంబ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గ్రామంలోని సేవా దృక్పథం కలిగిన వ్యక్తులు, సంస్థలు ఇలాంటి ప్రతిభావంతులను ప్రోత్సహించడం ఎంతో అభినందనీయమని కొనియాడారు.



# అక్రమంగా మద్యం విక్రయిస్తే కఠిన చర్యలు

**జడ్చర్ల ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్**

మిడ్జిల్, అక్టోబర్ 22 (మనం న్యూస్) : మిడ్జిల్ మండల కేంద్రంలో గురువారం ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ స్థానిక రేణుక ఎల్లమ్మ వైన్స్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైన్స్ రికార్డులను పరిశీలించి, అమ్మకాల వివరాలను నిర్వాహకులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. వైన్స్ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా మద్యం విక్రయిస్తే సహించేది లేదని హెచ్చరించారు. నిబంధనలను ఉల్లంఘించి బెల్టు దుకాణాలకు లేదా అనధికారికంగా మద్యం తరలిస్తే చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని వైన్స్ నిర్వాహకులకు స్పష్టం చేశారు. తనిఖీల సమయంలో అక్రమాలకు తావులేకుండా పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన సూచించారు.



## పండుగ సాయన్న ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

### గద్వాల జిల్లా ఓబీసీ సెల్ ఇన్చార్ నందిమల్ల చంద్రమౌళి

వనపర్తి అక్టోబర్ 23 (మనం ప్రతినిధి) కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో డీసీసీ చీఫ్ శివసేన రెడ్డి ఆదేశాల మేరకు ఓబీసీ నాయకులు నందిమల్ల చంద్రమౌళి ఆధ్వర్యంలో గురువారం పండుగ సాయన్న ముదిరాజ్ 174వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నందిమల్ల చంద్రమౌళి మాట్లాడుతూ, పండుగ సాయన్న జీవిత చరిత్ర, ఆయన చేసిన పోరాటాలు, సమాజానికి అందించిన సేవలను కొనియాడారు. సమాజంలో అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడి, ప్రజల మన్ననలు పొందిన మహనీయుడు పండుగ సాయన్న అని పేర్కొన్నారు. ధైర్యసాహసాలకు, ప్రజా సంక్షేమం పట్ల నిబద్ధతకు ఆయన జీవితం నిదర్శనమని, ఆయన ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందిమల్ల యాదయ్య, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతయ్య, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్‌మెంట్ జిల్లా అధ్యక్షులు రాజ్ కుమార్, పెబ్బేరు మండలాధ్యక్షులు రాంరెడ్డి, సేవాదళ్ జిల్లా అధ్యక్షులు జానకిరాములు, కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధులు జనార్దన్ సాగర్, ముదిరాజ్ సంఘం నాయకులు మాజీ కౌన్సిలర్ గణేష్, కూరగాయల రవి, పూజారి వెంకటస్వామి, నందిమల్ల నిఖిల్ చంద్ర ముదిరాజ్ పాల్గొన్నారు.



## పేదల పెన్నిధి, తెలంగాణ రాబిన్‌హుడ్

### పండుగల సాయన్నకు ఘన నివాళి

వనపర్తి, అక్టోబర్ 23 (మనం ప్రతినిధి) : పేదల పక్షపాతి, తెలంగాణ రాబిన్‌హుడ్‌గా ప్రసిద్ధి చెందిన వీరుడు పండుగల సాయన్న 174వ జయంతి వేడుకలు వనపర్తిలో అంగరంగ వైభవంగా జరిగాయి. పట్టణంలోని రాజా గారి బంగ్లా సమీపంలో, పాలిటెక్నిక్ కళాశాల ఎదురుగా ఉన్న ఆయన చిత్రపటానికి ముదిరాజ్ సంఘం పెద్దలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదే స్థలంలో పండుగల సాయన్న విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించిన పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముదిరాజ్ సంఘం పెద్దలు మాట్లాడుతూ.. పండుగల సాయన్న గొప్ప పోరాట యోధుడని, పేదల పక్షాన నిలిచి వారి జీవితాల్లో వెలుగులు నింపిన వ్యక్తిగా ప్రజల గుండెల్లో నిలిచిపోయారని పేర్కొన్నారు. పెద్దల వద్ద నుంచి సంపదను తీసుకొని పేదలకు పంచేవాడనే పేరుతో ఆయనకు ప్రజలు 'పండుగల సాయన్న' అనే బిరుదు ఇచ్చారని తెలిపారు. ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా బొలేమోని లక్ష్మయ్య పాల్గొనగా, నందిమల్ల చంద్రమౌళి, నందిమల్ల యాదయ్య, కొమ్ము శ్రీనివాసులు, పుట్ట బాలరాజు, కూరగాయల రవి, ఎన్. గణేష్, గాంధీ, పూజారి వెంకటస్వామి, ఫొటోగ్రాఫర్ ఆంజనేయులు, వి. లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## మూగజీవాల వైద్యానికి ఆధునిక రక్ష

**ఉప్పునుంతల వెటర్నరీ ఆస్పత్రిలో 'ట్రేవిస్' సదుపాయం!**

**ప్రత్యేక షెడ్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ**

**వైద్య సిబ్బందికి సురక్షితం.. రైతులకు అత్యంత ప్రయోజనకరం**



ఉప్పునుంతల, అక్టోబర్ 22( మనం న్యూస్) : గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే పాడి పశువుల సంరక్షణకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ పశువైద్యశాలలో మూగజీవాలకు మెరుగైన, సత్వర వైద్యసేవలు అందించే లక్ష్యంతో నూతనంగా ఏర్పాటు చేసిన అధునాతన 'ట్రేవిస్' పరికరంతో పాటు ప్రత్యేక షెడ్‌ను గురువారం ఆయన ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా పశువులకు టీకాలు వేసి వైద్య ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో రైతులు పశుసంపదపైనే అధికంగా ఆధారపడి జీవిస్తున్నారని, వాటికి ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తినా వెంటనే నాణ్యమైన చికిత్స అందేలా ఆసుపత్రుల్లో మౌలిక వసతులు మెరుగుపరుస్తున్నామని తెలిపారు. చికిత్స సమయంలో పెద్ద పశువులు బెదరకుండా, సురక్షితంగా ఉంచేందుకు ట్రేవిస్ ఎంతగానో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

**చికిత్సకు సురక్షిత సాధనం 'ట్రేవిస్'**

ఆవులు, గేదెలు వంటి బలిష్టమైన పశువులకు వైద్యం అందించే సమయంలో అవి కదలకుండా ఒకేచోట నిలబెట్టేందుకు ఈ 'ట్రేవిస్' కీలకంగా మారనుంది. దీని ద్వారా:పశువులకు నొప్పి తెలియకుండా సులభంగా ఇంజెక్షన్లు, వ్యాధి నిరోధక టీకాలు వేయవచ్చు.తీవ్రమైన గాయాలు, శస్త్రచికిత్సలు, డ్రెస్సింగ్ పనులను సురక్షితంగా నిర్వహించవచ్చు.కృత్రిమ గర్భధారణ ప్రక్రియతో పాటు పునరుత్పత్తి సంబంధిత వైద్య పరీక్షలు వేగవంతంగా పూర్తవుతాయి.చికిత్స సమయంలో పశువులు అకస్మాత్తుగా ఎగరడం లేదా తన్నడం వల్ల వైద్య సిబ్బందికి, రైతులకు జరిగే ప్రమాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.



**ఎండ, వానల నుంచి రక్షణగా ప్రత్యేక షెడ్**

వైద్యం కోసం ఆసుపత్రికి తీసుకొచ్చే పశువులు తీవ్రమైన ఎండ, భారీ వర్షం, ఈదురుగాలుల బారిన పడకుండా ఉండేందుకు ట్రేవిస్ ప్రాంగణంలోనే ప్రత్యేక షెడ్‌ను నిర్మించారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లోనూ వైద్యులు, సిబ్బంది ఎటువంటి ఆటంకం లేకుండా సేవలు అందించేందుకు ఈ నీడ ఎంతగానో దోహదపడుతుందని స్థానిక రైతులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ చింతగల్ల శ్రీనివాసులు, ప్రజాప్రతినిధులు, నాయకులు అనంతరెడ్డి, తిప్పర్తి నరసింహారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్నె లక్ష్మీనారాయణ, యువజన కాంగ్రెస్ నాయకుడు మేడమోని భాస్కర్ రాథ్లావత్ కృష్ణ అంతటివెంకటయ్య గౌడ్ శ్రీను పశువైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్ కుమార్, వైద్య సిబ్బందితో పాటు పరిసర గ్రామాల రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## పండుగ సాయన్న పోరాట స్ఫూర్తి చిరస్మరణీయం

**కలెక్టరేట్‌లో 174వ జయంతి వేడుకలు**



మహబూబ్‌నగర్, అక్టోబర్ 22 (మనం ప్రతినిధి ): మహబూబ్‌నగర్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం పండుగ సాయన్న 174వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిజాం పాలనలో భూస్వాములు, దొరలు, దేశ్‌ముఖ్‌ల అరాచకాలను ఎదిరించి పోరాడిన ధీరుడు పండుగ సాయన్న అని పేర్కొన్నారు. పేదలు, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం, సమసమాజ నిర్మాణం కోసం ఆయన సాగించిన పోరాటం చిరస్మరణీయమని అన్నారు. అణగారిన వర్గాల హక్కుల కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి సైతం స్ఫూర్తిదాయకమని తెలిపారు. పండుగ సాయన్న పోరాట పటిమ, సామాజిక స్పృహ ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా నిలవాలని ఆమె ఆకాంక్షించారు. ఆయన ఆశయాలను స్మరించుకుంటూ సమానత్వం, సామాజిక న్యాయం దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎ. నిర్మల, పరిపాలన అధికారి సువర్ణరాజుతో పాటు కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## నార్లాపూర్ - కెఎల్ఐ అనుసంధాన తూము తెరిస్తే

# చివరి ఆయకట్టుకు మేలు

**నార్లాపూర్ రిజర్వాయర్ పనులు వేగవంతం చేయాలి**

**కెఎల్ఐ పంపులను 24 గంటలు నడపాలి**

**మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి డిమాండ్**



వనపర్తి, అక్టోబర్ 23 (మనం ప్రతినిధి) : పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగమైన నార్లాపూర్ రిజర్వాయర్ పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం ఆయన బీఆర్ఎస్ నాయకులు బీరం హర్షవర్ధన్ రెడ్డితో కలిసి నార్లాపూర్ రిజర్వాయర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో 6.5 టీఎంసీల సామర్థ్యంతో ఈ రిజర్వాయర్ ను నిర్మించామని, 2023 సెప్టెంబర్ లో ఒక పంపు ద్వారా 4 టీఎంసీల నీటిని నింపామన్నారు. గత మూడేళ్లుగా మిగిలిన పనులు పెండింగ్ లో ఉ ఒడటం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నార్లాపూర్ నుండి కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి అనుసంధానంగా నిర్మించిన తూము ద్వారా 800 క్యూసెక్కుల నీటిని నిరంతరాయంగా అందించవచ్చని, దీనివల్ల చివరి ఆయకట్టు రైతులకు ప్రయోజనం చేకూరుతుందని తెలిపారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకం పంపులను 24 గంటలు నడపాలని, ఎల్ నినో నేపథ్యంలో సాగునీటి అవసరాలపై ప్రభుత్వం దృష్టి సారించాలని ఆయన కోరారు.



## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల డిమాండ్లు నెరవేరే వరకు అండగా ఉంటాం

**-డిటిఎఫ్ నేతలు**



వనపర్తి అక్టోబర్ 23 (మనం ప్రతినిధి) జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు ఉపాధ్యాయ సమాఖ్య అండగా ఉంటుందని డిటిఎఫ్ నాయకులు ప్రకటించారు. జిల్లా కేంద్రంలో ఎన్ హెచ్ ఎం ఉద్యోగులు చేపట్టిన నిరాహార దీక్ష గురువారం 10వ రోజుకు చేరింది. దీక్షా శిబిరాన్ని డిటిఎఫ్ మాజీ రాష్ట్ర కార్యదర్శి కె. జోసెఫ్, జిల్లా అధ్యక్షుడు ఇ. నరసింహ, ప్రధాన కార్యదర్శి కురుమయ్య, రాష్ట్ర కౌన్సిలర్ చిన్న రాములు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడు రాష్ట్రాల్లో ఎన్ హెచ్ ఎం ఉద్యోగులను రెగ్యులరైజ్ చేశారని, తెలంగాణలో ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. హక్కులు సాధించే వరకు పోరాటం ఆపవద్దని, ప్రభుత్వం దిగి వచ్చే వరకు దీక్ష కొనసాగించాలని పిలుపునిచ్చారు. టీఎన్జీవో నాయకులు రాజా రామ్ ప్రసాద్, ఇతరులు ఆర్థిక సహాయం అందించి మద్దతు తెలిపారు. ప్రముఖ ప్రజా వైద్యశాల వైద్యుడు మురళీధర్ కూడా సహాయం అందిస్తానని తెలిపారు. డిటిఎఫ్ సభ్యులు, జిల్లాలోని ఎన్ హెచ్ ఎం సిబ్బంది పాల్గొన్నారు.






## పండగ సాయన్న జీవితం స్ఫూర్తిదాయకం

**ఎమ్మెల్యే మేఘారెడ్డి**

వనపర్తి అక్టోబర్ 23 (మనం ప్రతినిధి) : అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన పండుగ సాయన్న జీవితం స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఐడీఓసీలో గురువారం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పండుగ సాయన్న జయంతి వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే మేఘా రెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ధైర్యసాహసాలకు, ప్రజా సంక్షేమానికి సాయన్న జీవితం నిదర్శనమన్నారు. కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ సాయన్న ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, సామాజిక సమానత్వం, ప్రజాసేవ వంటి విలువలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కళాకారుడు రాజా రామ్ ప్రకాష్ ఆలపించిన పాట ఆకట్టుకుంది. లకార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ బొలెమోని లక్ష్మయ్య, పీసీసీ కార్యదర్శి నందిమల్ల యాదయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కదిరె రాములు యాదవ్, గద్వాల జిల్లా ఓబీసీ ఇన్చార్జి నందిమల్ల చంద్రమౌళి, నందిమల్ల వెంకట గణేష్, కూరగాయల రవి, చుక్క రాజు, రాహుల్, అధికారులు, ముదిరాజ్ సంఘ నాయకులు పాల్గొన్నారు.



## ఏదులలో శమీ పూజపై బీఎస్పీ అభ్యంతరం

**సర్పంచ్‌కు సమాచారం ఇవ్వకపోవడంపై ప్రశ్నించిన జిల్లా అధ్యక్షుడు మిద్దె మహేష్**

ఉమ్మడి గోపాలపేట, అక్టోబర్ 22 (మనం న్యూస్): వనపర్తి జిల్లా ఏదుల గ్రామంలో విజయదశమి సందర్భంగా నిర్వహించిన శమీ పూజ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కాటమోని పరుశురాం యాదవ్‌కు సమాచారం ఇవ్వలేదని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) వనపర్తి జిల్లా అధ్యక్షుడు మిద్దె మహేష్ అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధులకు గ్రామంలో జరిగే ముఖ్యమైన కార్యక్రమాల్లో తగిన గౌరవం ఇవ్వాలని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ ప్రథమ పౌరుడైన సర్పంచ్‌కు సమాచారం ఇవ్వకుండా శమీ పూజ నిర్వహించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సర్పంచ్‌కు సమాచారం ఇవ్వకపోవడానికి గల కారణాలను సంబంధిత నిర్వాహకులు స్పష్టం చేయాలని కోరారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తి సర్పంచ్‌గా ఎన్నికైనందునే ఆయనను పక్కనపెట్టారా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని మిద్దె మహేష్ పేర్కొన్నారు. గ్రామంలో కుల వివక్షకు తావులేకుండా అన్ని సామాజిక వర్గాల ప్రజలను సమానంగా గౌరవిం చాలని సూచించారు. విజయదశమి వంటి పండుగలు ప్రజల మధ్య ఐక్యత, సోదరభావాన్ని పెంపొందించాలని, అలాంటి సందర్భాల్లో విభేదాలకు తావివ్వకూ డదని అన్నారు. భారత రాజ్యాంగం కల్పించిన సమానత్వ సూత్రాలకు అనుగుణం గా ప్రతి ఒక్కరికీ గౌరవం దక్కాలని పేర్కొన్నారు. గ్రామాల్లో కుల ఆధిపత్య ధోరణు లకు బదులుగా సామాజిక సమానత్వానికి ప్రాధాన్యత ఇవ్వాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ వనపర్తి జిల్లా ప్రధాన కార్యదర్శి కుంటి మధు, గ్రామ అధ్యక్షుడు కిరణ్, కమిటీ సభ్యులు రాములు, దేవా, వేణు తదితరులు పాల్గొన్నారు.



# పాలమూరును ఏడారిగా మార్చే డిండి ఎత్తిపోతలను రద్దు చేయాలి

### జేపీసీ నాయకులు ఏకుల ప్రకాష్

### ఎర్రవల్లి భూనిర్వాసితుల దీక్ష 325వ,రోజు

చారకొండ,అక్టోబర్22(మనం న్యూస్) : ఉమ్మడి పాలమూరు జిల్లాను ఎడారిగా మార్చే డింగి ఎత్తిపోత బతుకమ్మన రద్దు చేయాలని జేపీసీ నాయకులు ఏకుల ప్రకాష్ అన్నారు. గురువారం చారకొండ మండలం ఎర్రవల్లి గ్రామం లో నిర్మించ తలపెట్టిన గోకారం–ఎర్రవల్లి రిజర్వాయర్ వలన ఎర్రవల్లి,ఎర్రవల్లి తండా ముంపుకు గురి కావడమే కాకుండా సర్వ హక్కులు పోతున్నామని చేస్తున్న రిలే నిరాహార దీక్షలు గురువారం నాటికి 325వ,రోజుకు చేరింది.జేపీసీ నాయకులు మాట్లాడుతూ... పండుగ సాయన్న స్ఫూర్తితో ఆయన జయంతి సందర్భంగా అక్టోబర్ 22న,మహబూబ్ నగర్ పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి, డిండి ఎత్తిపోతల పథకం రద్దు చేయాలి తద్వారా ఎర్రవల్లి,ఎర్రవల్లి తండాలను ముంపు నుండి కాపాడాలి అని ఉమ్మడి మహబూబ్ నగర్ పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేపీసీ ఆధ్వర్యంలో లక్ష సంతకాల సేకరణ మహోద్యమానికి ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వ్యాప్తంగా పిలుపునిచ్చారు.దాంట్లో భాగంగా ఈ ప్రాజెక్టులో ప్రత్యక్ష బాధిత గ్రామమైన ఎర్రవల్లి లో ఈ ఉద్యమాన్ని మొదలుపెట్టాం.ఈ ఉద్యమంలో ఉమ్మడి పాలమూరు వ్యాప్తంగా ప్రతి ఒక్కరూ భాధ్యతగా పాల్గొని పాలమూరు ను ఎడారిగా మార్చే డిండి ఎత్తిపోతల పథకం రద్దు చేసే వరకు పోరాడాలని భూ నిర్వాసిత బాధితులకు పిలుపునిచ్చారు.ఎర్రవల్లి,ఎర్రవల్లి తండాను ముంపు నుండి విముక్తి కల్పించే వరకు ఈ భూపోరటం కొనసాగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఎర్రవల్లి,ఎర్రవల్లి తండా భూ నిర్వాసితుల బాధితులు జేసి నాయకులు పాల్గొన్నారు.

# పండుగ సాయన్న జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకం

### ఘనంగా పండుగ సాయన్న జయంతి

### జయంతి వేడుకలో మాజీ మంత్రి శ్రీనివాస్ రెడ్డి

మహబూబ్ నగర్, 22అక్టోబర్, (మనం న్యూస్) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పద్మావతి కాలనీలో పేదల, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, బహుజన వీరుడు, తెలంగాణ రాబిన్ హుడ్‌గా పేరుగాంచిన పండుగ సాయన్న జయంతి సందర్భంగా మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్ ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా పండుగ సాయన్న పేదలకు, అణగారిన వర్గాల ప్రజల కోసం చేసిన పోరాటాన్ని స్మరించుకున్నారు. పేదల పక్షాన నిలబడి, ప్రజల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్న పండుగ సాయన్న జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.ఈ కార్యక్రమం లో గ్రంథాలయంసంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్ గౌడ్, మున్సిపల్ మాజీ చైర్మన్ నర్సింహులు, మాజీ వైస్ చైర్మన్ గణేష్, కార్పొరేటర్ కిషోర్, రమేష్ నాయక్, శరత్, సీనియర్ నాయకులు అనంత రెడ్డి, కట్ట రవికిషన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సాయిలు తదితరులు కార్యకర్తలు పాల్గొన్నారు



# అక్టోబర్ 25, 26 తేదీల్లో చలో హైదరాబాద్

### కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి

### మల్టీ డే మహా ధర్నాను జయప్రదం చేయండి

### సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి. శివవర్మ



కొల్లాపూర్, అక్టోబర్ 22 (మనం న్యూస్): నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండల కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో అక్టోబర్ 25, 26 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించనున్న చలో హైదరాబాద్ మహా ధర్నాకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి. శివవర్మ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సంఘటిత, అసంఘటిత రంగ కార్మికులంతా ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో సుమారు రెండు కోట్ల మంది సంఘటిత, అసంఘటిత కార్మికులు ఉన్నారని, వారి సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని శివవర్మ విమర్శించారు. కార్మికుల హక్కులను పరిరక్షించాల్సిన ప్రభుత్వాలు కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌ల వల్ల కార్మికుల హక్కులకు భంగం కలుగుతోందని, ప్రభుత్వ రంగ సంస్థలు దెబ్బతింటున్నాయని పేర్కొన్నారు. కనీస వేతనాల చట్టాన్ని సమర్థంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని, ప్రైవేటీకరణను నిలిపివేయాలని ఆయన కోరారు. గ్రామపంచాయతీ కార్మికులకు అమలు చేస్తున్న మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేయాలని, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ శాఖల్లో ఏజెన్సీ వ్యవస్థను రద్దు చేసి వేతనాలు పెంచడంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

# మున్సిపల్ కార్మికుల గళమెత్తిన పోరాటం

### 26న 'చలో హైదరాబాద్'!

### ఏళ్ల తరబడి సేవలందిస్తున్నా పర్మినెంట్ ఎక్కడ?

### రూ.30 వేల కనీస వేతనం, రెండో పీఆర్సీ, డీఏ అమలు చేయాలి

పాలమూరు , అక్టోబర్ 22 (మనం న్యూస్) : పట్టణాలను పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అహర్నిశలు శ్రమిస్తున్న మున్సిపల్ కార్మికుల జీవితాల్లో మాత్రం మార్పు ఎప్పుడు? ఏళ్ల తరబడి విధులు నిర్వహిస్తున్నా ఉద్యోగ భద్రత కరవైందని, చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్నామని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం మరోసారి సమరశంఖం పూరించారు. తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అక్టోబర్ 26న 'చలో హైదరాబాద్' కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు అనుమతి కోరుతూ జడ్చర్ల మున్సిపల్ కమిషనర్‌కు యూనియన్ ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.



### పర్మినెంట్ చేయాలి.. రూ.30 వేల వేతనం ఇవ్వాలి!

రాష్ట్రవ్యాప్తంగా సుమారు 60 వేల మంది మున్సిపల్ కార్మికులు పనిచేస్తున్నారని యూనియన్ పేర్కొంది. సంవత్సరాల తరబడి సేవలందిస్తున్నా శాశ్వత ఉద్యోగులుగా గుర్తించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. కనీస వేతనాన్ని నెలకు రూ. 30 వేలకు పెంచాలని, రెండో పీఆర్సీ అమలు చేయాలని, డీఏ చెల్లించాలని డిమాండ్ చేసింది. అలాగే ఖాళీలను భర్తీ చేసి పనిభారం తగ్గించాలని, అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని, జీవో నెం. 1181ను రద్దు చేయాలని కోరింది.

### కార్మికుల ప్రాణాలకు రక్షణ ఏదీ?

మురుగు కాలువలు, చెత్తాచెదారం మధ్య పనిచేసే కార్మికులకు రక్షణ పరికరాలు, వైద్య సదుపాయాలు కల్పించాలని యూనియన్ డిమాండ్ చేసింది. విధుల్లో ప్రమాదాలు జరిగితే తగిన పరిహారం అందించాలని, మరణించిన లేదా అనారోగ్యంతో పనిచేయలేని కార్మికుల అర్హులైన కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించాలని కోరింది. కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ఇచ్చిన వేతనాల పెంపు, ఉద్యోగాల శాశ్వతీకరణ, కార్మికుల కాలనీల ఏర్పాటు హామీలను అమలు చేయాలని యూనియన్ ప్రభుత్వాన్ని నిలదీసింది.

### వినతులతో సరిపెట్టొద్దు.. సమస్యలు పరిష్కరించాలి!

జడ్చర్ల మున్సిపాలిటీలో అక్టోబర్ 22న వినతిపత్రం అందజేసిన వారిలో ఇందిరమ్మ, కృష్ణ, స్వరూప, వెంకటమ్మ, కవిత, వెంకటయ్య, సుగుణ, రాణమ్మ, అంజమ్మ, మాసయ్య తదితర కార్మికులు పాల్గొన్నారు. పట్టణాలను శుభ్రం చేసే కార్మికుల జీవితాలు మాత్రం సమస్యలతో మురికికూపంలోనే ఉండాలా? ఏళ్ల తరబడి వారి శ్రమను వినియోగించుకుంటూ ఉద్యోగ భద్రత, న్యాయమైన వేతనాల విషయంలో జాప్యం చేయడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. అక్టోబర్ 26న జరిగే 'చలో హైదరాబాద్'తోనైనా ప్రభుత్వం స్పందించి, కార్మికుల డిమాండ్ల పరిష్కారానికి స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని యూనియన్ కోరుతోంది.

# గురుకులాలతో పేద విద్యార్థులు ఎవరెస్ట్ శిఖరానికి!

**అక్షరం, ఆర్థికం, ఆరోగ్యం, ఆత్మగౌరవమే స్వేరోస్ లక్ష్యం: బండమీద కృష్ణ**



నాగర్ కర్నూల్,( మనం న్యూస్ అక్టోబర్ 22 ) : విద్య ద్వారానే సామాజిక అసమానతలను అధిగమించి సమాజంలో సమాన అవకాశాలను సాధించవచ్చని స్వేరోస్ నాగర్ కర్నూల్ జిల్లా అధ్యక్షుడు బండమీద కృష్ణ అన్నారు. గురువారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో స్వేరోస్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు విక్టరీ డే వేడు కలను ఘనంగా నిర్వహించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గురుకుల విద్యా వ్యవస్థ అభివృద్ధికి కృషి చేసి, విద్యకు దూరంగా ఉన్న అణగారిన వర్గాలకు నాణ్యమైన విద్య అందించడంలో ఎస్.ఆర్. శంకరన్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లల విద్యాభివృద్ధికి ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. తెలంగాణ గురుకుల విద్యా వ్యవస్థకు ప్రపంచస్థాయిలో గుర్తింపు తీసుకురావడంలో డాక్టర్ ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ కృషి ఎంతో ఉందన్నారు. ఉన్నతమైన ఐపీఎస్ ఉద్యోగాన్ని వదిలి గురుకులాల కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన ఆయన విద్యార్థుల అభ్యున్నతికి విశేషంగా కృషి చేశారని తెలిపారు. ప్రపంచంలోనే అత్యంత చిన్న వయసులో ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించిన మలావత్ పూర్ణ వంటి ప్రతిభావంతులను తీర్చిదిద్దడంలో గురుకుల విద్యా వ్యవస్థ కీలక పాత్ర పోషించిందని పేర్కొన్నారు. అక్షరం, ఆర్థికం, ఆరోగ్యం, ఆత్మగౌరవం అనే లక్ష్యాలతో స్వేరోస్ సమాజం ముందుకు సాగుతోందని తెలిపారు. స్వేరోస్ విక్టరీ డే విద్య, సమానత్వం, సామాజిక చైతన్యం ప్రాధాన్యతను గుర్తుచేసే రోజని అన్నారు. స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింటూ, ఉపాధ్యక్షులు పరమేశ్వర్, రాము, కృష్ణ పాల్గొన్నారు.



## అమ్మవారి లడ్డు 50 వేలకు కైవసం చేసుకున్న తమ్మిశెట్టి విక్రమ్

చారకొండ,అక్టోబర్22(మనం న్యూస్) : చారకొండ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ హై స్కూల్ లో టీం-జడ్పిహెచ్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గామాత నవరాత్రి ఉత్సవాలు బుధవారం రాత్రి అంగరంగ వైభవంగా నిర్వహించారు. చారకొండ మండలంలో పెద్ద ఎత్తున అమ్మవారి లడ్డు 50వేలకు చారకొండ గ్రామానికి చెందిన తమ్మిశెట్టి విక్రం కైవసం చేసుకున్నారు.అమ్మవారి చీరలు శివశతులకు బహుమతిగా నిర్వాహకులు అందజేశారు. అమ్మవారి ధనమాలను29 వేలకు జెల్లసత్తయ్య వారసులు కైవసం చేసుకోగా,చిన్న లడ్డును చెల్లమల్ల మురళి 10 వేలకు కైలాసం చేసుకున్నారు. దసరా నవరాత్రులు అంగరంగ వైభవంగా భక్తిశ్రద్ధలతో ప్రతిరోజు ప్రత్యేక పూజలు నిర్వహించి అదే మాదిరిగా అన్నదాన కార్యక్రమాలు చేపట్టారు. సాంస్కృతిక కార్యక్రమాల తో ఆటపాటలు,కోలాటాలు ఆడపడుచులు మహిళలు యువకులు ఉత్సాహంగా పాల్గొని నిర్వాహలకు సహకరించి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు,గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, ఆడపడుచులు నిర్వాహకులు పాల్గొన్నారు.

# రవీంద్ర భారతిలో బాద్మి ధ్రువ నటవిశ్వరూపం!

**పండుగ సాయన్న మళ్లీ వచ్చాడా? అన్నట్లుగా ప్రదర్శన**

**పండుగ సాయన్న పాత్రలో జీవించిన బాద్మి ధ్రువ**

**ప్రేక్షకుల హృదయాలను కదిలించిన చారిత్రక నాటకం!**



పాలమూరు,అక్టోబర్ 22(మనం న్యూస్) : ఒక మనిషి చరిత్రలో నిలిచిపోవడం గొప్ప విషయం.. కానీ తరాలు మారినా, కాలం గడిచినా, ప్రజల గుండెల్లో సజీవంగా నిలవడం అంతకంటే గొప్ప విషయం! అణగారిన వర్గాల ఆత్మగౌరవానికి, పేదల ఆశలకు, అన్యాయాన్ని ఎదిరించే ధైర్యానికి ప్రతీకగా నిలిచిన పండుగ సాయన్న పేరు మరోసారి మార్మోగింది. హైదరాబాద్‌లోని ప్రతిష్ఠాత్మక రవీంద్ర భారతిలో జరిగిన పండుగ సాయన్న 174వ జయంతి సందర్భంగా జడ్చర్లకు చెందిన కళాకారులు ప్రదర్శించిన నాటకం ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేసింది. ముఖ్యంగా పండుగ సాయన్న పాత్రలో బాద్మి ధ్రువ ప్రదర్శించిన నటన ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**పాత్రను పోషించలేదు.. పండుగ సాయన్నగా జీవించాడు!**

నాటకంలో ప్రధాన పాత్రధారి బాద్మి ధ్రువ వేదికపైకి వచ్చిన క్షణం నుంచి ప్రేక్షకుల దృష్టి ఆయనపైనే నిలిచింది. పండుగ సాయన్న పాత్రకు ప్రాణం పోయాలంటే కేవలం వేషధారణ సరిపోదు.. ఆ పాత్రలోని ఆత్మగౌరవం, ఆవేశం, పేదల పట్ల ప్రేమ, అన్యాయంపై పోరాట స్ఫూర్తి నటనలో ప్రతిఫలించాలి. ఈ భావాలను తన హావభావాలు, సంభాషణలు, శరీర భాష ద్వారా ఆవిష్కరించేందుకు బాద్మి ధ్రువ చేసిన ప్రయత్నం ప్రేక్షకులను ఆకట్టుకుంది. పండుగ సాయన్న అంటే ఒక పేరు మాత్రమే కాదు.. ఒక చరిత్ర, ఒక పోరాట స్ఫూర్తి, ప్రజల జ్ఞాపకాలలో నిలిచిన ఒక భావోద్వేగం. అలాంటి పాత్రను వేదికపై ఆవిష్కరించడం చిన్న విషయం కాదు. ఆ పాత్రలోని భావోద్వేగాలను ప్రేక్షకులకు చేరువ చేయడంలో బాద్మి ధ్రువ తనదైన ముద్ర వేశారు. నాటకం సాగుతున్న కొద్దీ వేదికపై కనిపించింది ఒక కళాకారుడి నటన మాత్రమే కాదు.. పండుగ సాయన్న చరిత్రను నేటి తరానికి పరిచయం చేయాలనే కళాత్మక ప్రయత్నం.

**'పండుగ సాయన్న మళ్లీ వచ్చినట్టుంది'.. ప్రేక్షకుల భావోద్వేగం!**

నాటకం ముగిసిన అనంతరం పలువురు ప్రేక్షకులు ప్రదర్శనను ప్రశంసించారు. పండుగ సాయన్న పాత్రలో బాద్మి ధ్రువ నటన చూసినప్పుడు, చరిత్రలో చదివిన ఆ వ్యక్తి కళ్లముందు ప్రత్యక్షమైన భావన కలిగిందని కొందరు వ్యాఖ్యానించారు. పండుగ సాయన్న మళ్లీ మన మధ్యకు వచ్చినట్టుగా అనిపించిందన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఒక కళాకారుడి నటన ప్రేక్షకుడి మనసును తాకినప్పుడు.. ఒక చారిత్రక పాత్ర ప్రేక్షకుడి కళ్లలో భావోద్వేగాన్ని నింపినప్పుడు.. ఆ కళకు అంతకంటే పెద్ద గుర్తింపు ఏముంటుంది? పండుగ సాయన్న జీవితాన్ని, ఆయన పేరుతో ముడిపడిన ప్రజల భావోద్వేగాలను వేదికపైకి తీసుకురావడంలో ఈ నాటకం తన ప్రత్యేకతను చాటుకుంది.

**శశిధర్ రెడ్డి, సత్యం సహా కళాకారుల సమష్టి కృషి**

ఈ నాటకంలో బాద్మి ధ్రువ ప్రధాన పాత్ర పోషించగా, శశిధర్ రెడ్డి, సత్యం తదితర కళాకారులు ఇతర పాత్రల్లో నటించి తమ ప్రతిభను చాటుకున్నారు. ప్రతి పాత్ర కథకు అనుగుణంగా ముందుకు సాగడంతో నాటకానికి సమగ్రత చేకూరింది. సంభాషణలు, పాత్రల అభినయం, వేదికపై సన్నివేశాల ఆవిష్కరణ ప్రేక్షకులను కథలో లీనమయ్యేలా చేశాయి. జడ్చర్లకు చెందిన కళాకారులు హైదరాబాద్‌లోని రవీంద్ర భారతి వేదికపై తమ ప్రతిభను ప్రదర్శించడం స్థానిక కళారంగానికి గర్వకారణంగా నిలిచింది. ప్రాంతీయ కళాకారుల్లో దాగి ఉన్న ప్రతిభకు సరైన వేదిక లభిస్తే వారు చరిత్ర, సామాజిక చైతన్యం, ప్రజల జీవన అనుభవాలను ఎంత బలంగా ఆవిష్కరించగలరో ఈ ప్రదర్శన మరోసారి చాటిచెప్పింది.

**పండుగ సాయన్న చరిత్ర.. తరతరాలకు అందించాల్సిన వారసత్వం**

చరిత్రలో నిలిచిన వ్యక్తులను స్మరించుకోవడం అంటే జయంతులు నిర్వహించడం మాత్రమే కాదు. వారి జీవిత విశేషాలను, వారు ప్రాతినిధ్యం వహించిన విలువలను, ప్రజల జ్ఞాపకాలలో వారికి ఉన్న స్థానాన్ని భావితరాలకు అందించడం కూడా అంతే ముఖ్యం. నాటకం వంటి కళారూపాలు ఈ బాధ్యతను మరింత ప్రభావవంతంగా నిర్వర్తిస్తాయి. పుస్తకాల్లో చదివిన చరిత్రను వేదికపై కళ్లకు కట్టినట్టు చూపించడం.. గత తరాల అనుభవాలను నేటి ప్రేక్షకుల హృదయాలకు చేరవేయడం.. ఒక వ్యక్తి పేరులో దాగి ఉన్న సామాజిక భావోద్వేగాన్ని మళ్లీ గుర్తుచేయడం నాటక కళకు ఉన్న ప్రత్యేక శక్తి. పండుగ సాయన్న 174వ జయంతి సందర్భంగా జడ్చర్ల కళాకారులు చేసిన ఈ ప్రయత్నం ఆ దిశగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది.



# ముదిరాజ్‌లను బీసీ-డీ నుంచి బీసీ-ఏలోకి మార్చాలి

**పండుగోళ్ల సాయన్న జయంతి వేదికగా ముదిరాజ్ సంఘం డిమాండ్**

**సమాజానికి పండుగ సాయన్న ఆదర్శప్రాయుడు**

**మిడ్జిల్ మండల సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు ఎల్ల శంకర్ ముదిరాజ్**



మిడ్జిల్ అక్టోబర్ 22(మనం న్యూస్) : పేదలు, బహుజనుల హక్కుల కోసం, ఆధిపత్య వర్గాలపై పోరాడిన తెలంగాణ విప్లవ వీరుడు పండుగోళ్ల సాయన్న అందరికీ ఆదర్శప్రాయుడని మిడ్జిల్ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు ఎల్ల శంకర్ ముదిరాజ్ కొనియాడారు. గురువారం మిడ్జిల్ మండల కేంద్రంలోని అంబేద్కర్ బస్టాండ్ ఆవరణలో పండుగోళ్ల సాయన్న జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మిడ్జిల్ మండలంలోని అన్ని గ్రామాల నుంచి ముదిరాజ్ నాయకులు, యువకులు భారీ సంఖ్యలో తరలివచ్చి తమ ఐక్యతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ముదిరాజ్ కులస్తులను ప్రస్తుతం ఉన్న బీసీ-డీ (BC-D) నుంచి బీసీ-ఏ (BC-A)లోకి మార్చాలని నాయకులు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. జనాభా ప్రాతిపదికన, సామాజికంగా ఎదుర్కొంటున్న వెనుకబాటు తనాన్ని దృష్టిలో ఉంచుకుని ముదిరాజ్‌లకు తగిన ప్రాధాన్యం కల్పించాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దీజీవీ రాష్ట్ర నాయకుడు పల్లె తిరుపతి ప్రసంగిస్తూ.. పేదల ఆకలి తీర్చిన ప్రజా నాయకుడు సాయన్న ఆశయాలను యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. అనంతరం సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు రవి కుమార్ ముదిరాజ్, బండారి వెంకటయ్య, నర్సింహ ముదిరాజ్, జంగయ్య ముదిరాజ్, వివిధ గ్రామాల ముదిరాజ్ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## MBBS సీటు సాధించిన సూర్యప్రసాద్‌కు సన్మానం

కొల్లాపూర్ 22 అక్టోబర్ (మనం న్యూస్) : సమాజంలో మార్పు కేవలం చదువుతూనే సాధ్యమన్న బాబా సాహెబ్ అంబేద్కర్ గారు చెప్పిన మాటలను నిజం చేస్తూ ఎన్నో కష్టాలను ఎదుర్కొని నేడు హయత్ నగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సీటు సాధించిన జాం సూర్యప్రసాదు ను పెంట్లవెల్లి బిఆర్ఎస్ పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గోవు రాజు శాలువాతో ఘనంగా సత్కరించారు. చదువుకు పేదరికం ఎప్పుడూ అడ్డుకాదని నాగర్ కర్నూల్ జిల్లా పెంట్లవెల్లి గ్రామానికి చెందిన జామ్ సూర్యప్రసాద్ నిరూపించారు. దినసరి కూలీలుగా కష్టపడే తల్లిదండ్రుల కష్టాన్ని వృథా కానివ్వకుండా, ప్రభుత్వ పాఠశాల కళాశాలల్లో చదువుతూ ఎలాంటి ఖరీదైన కోచింగ్ తీసుకోకుండానే ఎంబిబిఎస్ మెడికల్ సీటు సాధించి తన గ్రామానికి గొప్ప పేరు తేవాలన్నారు. పెంట్లవెల్లి గ్రామానికి చెందిన జామ్ వెంకటస్వామి, దేవేంద్రమ్మ దంపతులకు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు (సూర్యప్రసాద్) సంతానం. నిత్యం కూలీనాలీ చేస్తేనే కానీ కుటుంబం గడవని అతి సాధారణ పేద కుటుంబం వారిది. అయినప్పటికీ సూర్యప్రసాద్ కష్టపడి చదివి, నీట్‌లో మంచి ప్రతిభ కనబరిచి హైదరాబాద్‌లోని హయత్ నగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీలో ఎంబిబిఎస్ సీటు సాధించారు. విద్యార్థి జామ్ సూర్యప్రసాద్ ఎంబిబిఎస్ చదువు పూర్తి చేసుకుని డాక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత, దళిత జాతికి,నిరుపేద కుటుంబాలకు ఎల్లప్పుడూ ఉచితంగా వైద్య సేవలు అందించి అందించి అందరికీ ఆదర్శంగా నిలవాలని వారు కోరారు. పెంట్లవెల్లి అంబేద్కర్ వారసులు టీచర్ ఆంజనేయులు, నీరడి కురుమూర్తి,బోడ చెన్నకేశవులు, కోట్ల కొండల్, మూలే చంద్రశేఖర్, నాగటి రాజు, బిజ్జ కురుమూర్తి, మరికంటి హరీష్, బైరపోగు సతీష్, మరికంటి చెన్నకేశవులు, మూలే జగదీష్, మూలే గౌతం,ఏటూరి ప్రకాష్, బ్యాగరి కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన

# ప్రజా యోధుడు పండుగ సాయన్న

**పేదలు, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు పండుగ సాయన్న.**

**అదనపు కలెక్టర్ శ్రీను**



నారాయణపేట అక్టోబర్ 22 (మనం న్యూస్) : నిరంకుశ పాలనకు, పెత్తందారులు, భూస్వాములు, జమీందారీ వ్యవస్థల దోపిడీకి వ్యతిరేకంగా పోరాడిన తెలంగాణ ప్రజా యోధుడు పండుగ సాయన్న ముదిరాజ్ అని నారాయణపేట జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా కలెక్టరేట్ లోని ప్రజా వాణి హాల్ లో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన పండుగ సాయన్న జయంతి వేడుకల సందర్భంగా అదనపు కలెక్టర్ శ్రీను పండుగ సాయన్న చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజలపై జరిగిన అణచివేతను ఎదిరించి, పేద ప్రజల సంక్షేమం కోసం పోరాడిన ధైర్యశాలి పండుగ సాయన్న అని కొనియాడారు. తెలంగాణ ప్రజా వీరుడిగా, తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచిన పండుగ సాయన్న జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. సమాజంలోని పేద ప్రజల కష్టాలను గుర్తించి, వారి సంక్షేమం కోసం కృషి చేయడంతో పాటు, ప్రత్యేక సైన్యాన్ని ఏర్పాటు చేసుకొని బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం పోరాడిన ఇలాంటి మహనీయుల జీవితాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. మహనీయుల ఆశయాలను ఆదర్శంగా తీసుకొని సమాజంలో సమానత్వం, సేవాభావం, పేదల పట్ల మానవత్వం పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మెంబర్ పోషల్ రాజేష్, కలెక్టరేట్ ఏ వో అనిల్ కుమార్, బీసీ సంక్షేమ శాఖ అధికారి అబ్దుల్ ఖలీల్, ముదిరాజ్ సంఘం నాయకులు గవినోళ్ళ శ్రీనివాస్, వకీల్ సంతోష్ కుమార్, ఆకుల బాలప్ప, కాకర్ల భీమయ్య, పోషల్ వినోద్, నర్సిములు, పాండు, ఎల్ ఐ సీ లక్ష్మణ్, మల్లేష్, పోలేమోని గోవింద్, గొనే శీను, ఇతర సభ్యులు,ముదిరాజ్ యువజన సంఘం నాయకులు, కుల పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



## ఆడబిడ్డల ఆత్మగౌరవమే తెలంగాణకు ప్రతీక

**ఎమ్మెల్యే చిక్కుడు వంశీకృష్ణ..**

**పెనిమిళ్లలో వైభవంగా సద్దుల బతుకమ్మ వేడుకలు**

ఉప్పునుంతల, అక్టోబర్ 22 (మనం న్యూస్) : ఆడబిడ్డల ఆత్మగౌరవమే తెలంగాణ సంస్కృతికి అసలైన ప్రతీక అని, ప్రతి మహిళ ఆత్మవిశ్వాసంతో సమాజ నిర్మాణంలో భాగస్వామి కావాలని అచ్చంపేట ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్ డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ పిలుపునిచ్చారు. మండల పరిధిలోని పెనిమిళ్ల గ్రామంలో గురువారం నిర్వహించిన సద్దుల బతుకమ్మ సంబరాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామంలోని మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను తీర్చిదిద్ది, గౌరమ్మను కొలుస్తూ పాటలు, ఆటలతో సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వివక్ష లేని సమాజంలో మహిళల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పడాలని, బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా సంతోషాన్ని నింపాలని ఆకాంక్షించారు. అనంతరం బతుకమ్మలను స్థానిక చెరువులో గంగమ్మ ఒడికి చేర్చారు. ఈ వేడుకల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆదుపాల గోపాల్ రెడ్డి, స్థానిక సర్పంచ్ మెడసాని శ్రీలత విజేందర్ రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ జక్కా చంద్రశేఖర్ రెడ్డి, మెడసాని విజేందర్ రెడ్డితో పాటు స్థానిక నాయకులు, గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సరస్వతి ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

**ఘనంగా పదవరోజు పూజలు, బతుకమ్మల నిమజ్జనం కార్యక్రమం**

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 22 (మనం బ్యూరో) : నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయ



శివాలయంలో గురువారం శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు కన్నుల పండుగ నిర్వహించుకోవడం జరిగింది. గురువారం 10వ రోజున స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బతుకమ్మలను అంగరంగ వైభవంగా ఊరేగింపు ద్వారా తీసుకువెళ్తూ నిమజ్జనం చేశారు. పద్మశాలి మహిళా సంఘం ఆధ్వర్యంలో బతుకమ్మ ఆటపాటలు, కోలాటాలు, భక్తి పరవశంతో పూజలు చేస్తూ ముందుకు సాగారు. ప్రధాన ఆలయంలోని కోనేరులో బతుకమ్మల నిమజ్జనం కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పద్మశాలి మహిళా సంఘం అధ్యక్షురాలు పులిజాల కళ్యాణి, శివాలయ అధ్యక్షులు దాసు నాగరాజు, పద్మశాలి సంఘం అధ్యక్షుడు కోట కిషోర్, చిలువేరు శ్రావణి, కోట ప్రశాంతి, కర్నాటి రాములు, ఇమ్మడి రమేష్, చిలువేరు ధనరాజ్, గంజి జగదీశ్వర్, వనం రామకృష్ణ, గోషిక బాలకృష్ణ, దాసు వనిత, వనం మానస, గోశిక రజితలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర మంత్రుల పేరుతో బెదిరింపులా?

**రైతుల దారికి అడ్డుగోడ!**

**గంగాపూర్-గోప్లాపూర్ శివారులో రహదారి మూసివేత ఆరోపణలు..**

**అధికారుల మౌనం ఎందుకు?**



పాలమూరు, అక్టోబర్ 22 (మనం న్యూస్) : రైతు తన పొలానికి వెళ్లే దారినే మూసేస్తే సాగు చేసేదెలా? మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గంగాపూర్–గోప్లాపూర్ శివారులో వ్యవసాయ భూములకు వెళ్లే మార్గాన్ని ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ విత్తనాల వ్యాపారి అడ్డుకుంటున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. కేంద్ర మంత్రులతో పరిచయాలు ఉన్నాయని చెబుతూ, "ఎవరికి చెప్పుకున్నా బాట విడిచేది లేదు" అంటూ బెదిరిస్తున్నారని వాపోతున్నారు. ఉన్నత చదువులు చదివి మట్టినే నమ్ముకున్న యువ రైతు బాధిమి శశాంక్‌తో పాటు ఇతర రైతులు దారి సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెబుతున్నారు. పొలాలకు వెళ్లేందుకు మార్గం లేకపోతే విత్తనాలు, ఎరువులు తీసుకెళ్లడం, పంటను సాగు చేసి బయటకు తీసుకురావడం ఎలా అని ప్రశ్నిస్తున్నారు. రాజకీయ పలుకుబడి పేరుతో రైతులను భయపెడుతున్నారా? అన్న ఆరోపణలపై అధికారులు తక్షణమే విచారణ జరపాలి. వివాదాస్పద మార్గాన్ని రెవెన్యూ, సర్వే అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, భూముల రికార్డులు, దారి హక్కులను నిర్ధారించాలి. బెదిరింపులపై ఫిర్యాదులు అందితే పోలీసులు కూడా విచారణ చేపట్టాలి. రైతు తన భూమిలో సాగు చేసుకోవడానికి దారి కోసం పోరాడాల్సిన దుస్థితి ఎందుకు? ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. రైతుల రోదన అధికారులకు వినిపిస్తుందా? లేక పలుకుబడి ముందు అన్నదాత హక్కులు బలవుతాయా? సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి బాధిత రైతులకు న్యాయం చేయాలి.



# రాజపేట యువకుడికి జడ్జి ఉద్యోగం

**పేదరికాన్ని జయించి న్యాయమూర్తి అయిన దళిత బిడ్డకు బిజెపి నాయకుల సన్మానం**



వనపర్తి అక్టోబర్ 23 (మనం ప్రతినిధి) : కడు పేదరికంలో పుట్టి, ఎన్నో కష్టాలను ఓర్చి న్యాయమూర్తి స్థాయికి ఎదిగిన ఓ దళిత యువకుడి విజయగాథ జిల్లాకే గర్వకారణంగా నిలిచింది. వనపర్తి మండలం రాజపేట గ్రామానికి చెందిన దళిత నిరుపేద కుటుంబానికి చెందిన గద్వాల కృష్ణమ్మ, కురుమన్న దంపతుల కుమారుడు గద్వాల గోవింద్ తెలంగాణ హైకోర్టు ప్రకటించిన ఫలితాల్లో జూనియర్ సివిల్ జడ్జిగా ఎంపికయ్యారు. నిజాం కాలేజీలో డిగ్రీ, పెండెకంటి లా కాలేజీలో న్యాయశాస్త్రం పూర్తి చేసి, రంగారెడ్డి జిల్లాలో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తూనే తన లక్ష్యాన్ని సాధించారు. తల్లిదండ్రుల త్యాగం, పట్టుదలకు నిదర్శనంగా నిలిచిన ఈ యువకుడి విజయం పేద విద్యార్థులకు స్ఫూర్తిదాయకం. గోవింద్ విజయాన్ని తెలుసుకున్న బీజేపీ నాయకులు గురువారం ఆయనను, ఆయన మాతృమూర్తి కృష్ణమ్మను ఆత్మీయంగా సన్మానించారు. బీజేపీ నాయకుడు సబిరెడ్డి వెంకట్ రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఆర్. లోకనాథ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా లోకనాథ్ రెడ్డి మాట్లాడుతూ నిరుపేద దళిత కుటుంబంలో పుట్టి జడ్జిగా ఎదగడం అందరికీ ఆదర్శమని, బడుగు బలహీన వర్గాల యువత గోవింద్ ను స్ఫూర్తిగా తీసుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సామాజిక నాయకులు గంధం నాగరాజు, శంకర నాయక్, యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ నాయక్, కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు రాకేష్ రెడ్డి పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ షాబాద్దీన్ కు మెరుగైన వైద్యం అందించాలి

**నిమ్స్ ఆసుపత్రి లో పరామర్శించిన మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్**

మహబూబ్ నగర్, 22అక్టోబర్, (మనం న్యూస్) : మహబూబ్ నగర్ లో పని చేస్తున్న ఉర్దూ జర్నలిస్ట్ షాబాద్దీన్ గుండె సంబంధింత సమస్య తో హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రి లో చేరారు. జర్నలిస్ట్ కుటుంబ సభ్యులు శ్రీనివాస్ గౌడ్ దృష్టికి తీసుకువచ్చారు. మంత్రి వెంటనే హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రి కి చేరుకొని పరిస్థితి ని ఆరా తీసి వైద్యులతో మాట్లాడారు. నిమ్స్ వైద్యులతో మాట్లాడి మెరుగైన చికిత్స కు ఏర్పాట్లు చేశారు. వైద్య అధికారులతో మాట్లాడి మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు.





# రైస్ మిల్ యజమాని 7.85 కోట్ల మాయాజాలం

మాగనూర్ అక్టోబర్ 22 (మనం న్యూస్) : నారాయణ పేట జిల్లా మక్తల్ నియోజకవర్గం లోని మాగనూర్ మండలం వడ్వాట్ గ్రామ పరిధిలో ఉన్న శంకర్ లింగ రైస్ మిల్ లో 7.85కోట్ల ప్రభుత్వ ధాన్యం మాయమైనట్లు ఎన్ఫోర్స్ మెంట్ అధికారి డి యస్ ఓ బాలరాజు తనిఖీలో వెల్లడించారు. మొత్తం 80972 బస్తలకు గాను 7,85,30,918 రూపాయలు ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టినట్లు వెల్లడించారు. మాగనూర్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు చేసారు.



# యువత క్రీడల్లో రాణించాలి

**మణిగిల్ల సర్పంచ్ పలుస శ్రీనివాస గౌడ్**

పెద్దమందడి అక్టోబర్ 23 (మనం ప్రతినిధి) : యువత క్రీడల్లో పాల్గొని మానసిక ఉల్లాసంతో పాటు ఆరోగ్యంగా ఉండాలని మనిగిల్ల సర్పంచ్ పలుస శ్రీనివాస్ గౌడ్ అన్నారు. దసరా పండుగ సందర్భంగా మనిగిల్లలో రెండు రోజులుగా నిర్వహించిన మనిగిల్ల ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్ కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 6 జట్లు పాల్గొన్న ఈ టోర్నీలో మనిగిల్ల వారియర్స్ (కెప్టెన్ కురుమయ్య) విజేతగా, మనిగిల్ల కోబ్రాస్ (కెప్టెన్ సచిన్) రన్నర్ గా నిలిచాయి. విజేతలకు ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించి ఉద్యోగాలు సాధించి కుటుంబాలకు ఆసరాగా ఉండాలని, మత్తు పానీయాలకు బానిస కావద్దని సూచించారు. గ్రామంలో త్వరలో గ్రంథాలయం ఏర్పాటు చేస్తామని, రెండో ఎంపీఎల్ సీజన్ లో పాల్గొనే అన్ని జట్లకు టీ షర్టులు, మరిన్ని బహుమతులు ఇస్తామని హామీ ఇచ్చారు. ఇతర గ్రామాల టోర్నీలకు వెళ్లే జట్లకు ఎంట్రీ ఫీజులు తానే చెల్లిస్తానని, గ్రౌండ్, పిచ్ తయారీకి సహకరిస్తానని తెలిపారు. కప్పులు స్పాన్సర్ చేసిన సింగారపు మల్లికార్జున్ ను, ప్రైజ్ మనీ ఇచ్చిన సతీష్ సాగర్, రవి సాగర్ ను, నిర్వాహకులు బాలకృష్ణ, సచిన్, రామకృష్ణ, రోహిత్ లను అభినందించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గణేష్, గ్రామ పెద్దలు, క్రీడాకారులు పాల్గొన్నారు.

# పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలు

కొత్తకోట, అక్టోబర్ 22 (మనం న్యూస్): తెలంగాణ గడ్డపై అన్నగారిని వర్గాల ఆత్మగౌరవం కోసం పోరాడిన వీరుడు, పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన పాలమూరు వీరుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి వేడుకలను మండలంలోని వివిధ గ్రామాలలో ఘనంగా నిర్వహించారు.గురువారం మండల పరిధిలోని కనిమెట్ట గ్రామంలో గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకలకు గ్రామ ముదిరాజ్ బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూలమాలలు వేసి, కొబ్బరికాయలు కొట్టి ఘన నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం పండుగ సాయన్న జయంతిని అధికారికంగా నిర్వహించడం సంతోషదాయకమని, హర్షం వ్యక్తం చేస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పండుగ సాయన్న ఆశయాలను సాధించాలని, పేద ప్రజల అభ్యున్నతికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ వాకిటి బాలరాజు, మాజీ సర్పంచ్ పరమేష్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యాదగిరి, బీజేపీ నాయకులు హరికృష్ణ, వార్డు సభ్యులు కురుమూర్తి, మాజీ వార్డు సభ్యులు పరశురాములు, సంఘ సభ్యులు కొల్లంపల్లి, శ్రీనివాసులు, ఆంజనేయులు, వెంకటేష్, లక్ష్మణ్, కృష్ణ, హనుమంతు, వెంకటయ్య, బీస్పల్లి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



# జనాభా గణన రెండో దశను పకడ్బందీగా నిర్వహించాలి

**విధి విధానాలను ఖచ్చితంగా పాటించి తీరాలి**

**ఎక్కడ కూడ తప్పిదాలకు తావులేకుండా చూడాలి**

**నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**



ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 22 (మనం బ్యూరో) : నాగర్ కర్నూల్ జిల్లాలో జనాభా గణన రెండో దశను పకడ్బందీగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులు, సిబ్బంది భారత ప్రభుత్వం నిర్దేశిత విధి విధానాలను ఖచ్చితంగా పాటించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ సూచించారు. జనాభా గణన ప్రక్రియలో ఎలాంటి తప్పిదాలకు తావులేకుండా, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి అంశాన్ని జాగ్రత్తగా నిర్వహించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. జనాభా గణన రెండో దశ అధికారులకు జిల్లా అధికారులు, ఆర్డీవోలు , మున్సిపల్ కమిషనర్లు, జనగణన చార్జ్ అధికారులు, సహాయ చార్జ్ అధికారులకు అవగాహన కల్పించేందుకు గురువారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్‌లోని ప్రధాన హాల్‌లో ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, అచ్చంపేట సబ్ కలెక్టర్ సలోని చాబ్రా, అదనపు కలెక్టర్లు బి. చెన్నయ్య, దేవసహాయం కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా రెండో దశలో చేపట్టాల్సిన విధులు, బాధ్యతలు, అనుసరించాల్సిన కార్యాచరణపై సంబంధిత అధికారులకు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జనాభా గణన అత్యంత ప్రాధాన్యమైన ప్రభుత్వ కార్యక్రమమన్నారు. ఈ ప్రక్రియలో సేకరించే సమాచారం ప్రామాణికంగా ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. జనాభా గణనకు సంబంధించి భారత ప్రభుత్వం నిర్దేశించిన నియమ నిబంధనలు, మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ క్షుణ్ణంగా తెలుసుకొని విధులు నిర్వహించాలని సూచించారు. సమాచార సేకరణ, నమోదు తదితర ప్రక్రియల్లో నిర్లక్ష్యానికి తావులేకుండా, ప్రతి వివరాన్ని జాగ్రత్తగా పరిశీలించి నమోదు చేయాలని సూచించారు. జనాభా గణన రెండో దశలో తమకు కేటాయించిన బాధ్యతలను అధికారులు, సిబ్బంది సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు. శిక్షణలో వివరించే అంశాలను పూర్తిస్థాయిలో అవగాహన చేసుకొని, క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సమయంలో వాటిని తప్పనిసరిగా అమలు చేయాలని తెలిపారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సందేహాలను శిక్షణ సమయంలోనే నివృత్తి చేసుకొని, నిర్దేశించిన పద్ధతుల ప్రకారం ముందుకు సాగాలని సూచించారు. రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఈ శిక్షణ కార్యక్రమంలో జనాభా గణన రెండో దశలో చేపట్టాల్సిన పనులు, సంబంధిత అధికారుల బాధ్యతలు, విధుల నిర్వహణలో పాటించాల్సిన పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా ఛార్జ్ అధికారులు, అసిస్టెంట్లకు హైదరాబాద్ నుంచి వచ్చిన శిక్షకులు శివరామకృష్ణ, రిషిత్ రెడ్డి శిక్షణ అందించారు. జనాభా గణన ప్రక్రియలో భాగంగా తమకు అప్పగించిన విధులను సక్రమంగా నిర్వహించేందుకు అవసరమైన అంశాలను శిక్షకులు వివరించారు. శిక్షణలో నేర్చుకున్న విధివిధానాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తూ, జనాభా గణన రెండో దశను విజయవంతంగా పూర్తి చేసేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ శిక్షణ తరగతుల్లో సిపిఓ సుజాత, డీఈఓ రమేష్ కుమార్, ఆర్డీవోలు అర్చన, జనార్ధన్ రెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# వివేకానంద క్రికెట్ టోర్నీ విజేతగా పెబ్బేరు

**విజేతలకు బహుమతులు ప్రధానం చేసిన బిజెపి నేతలు**

వనపర్తి అక్టోబర్ 23 (మనం ప్రతినిధి) : ప్రధాని మోదీ 25 ఏళ్ల ప్రజా ప్రస్థానాన్ని పురస్కరించుకుని సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా వనపర్తిలో నిర్వహించిన వివేకానంద క్రికెట్ టోర్నమెంట్ సీజన్-1 విజేతగా పెబ్బేరు జట్టు నిలిచింది. పాలిటెక్నిక్ మైదానంలో ఆదివారం ప్రారంభమైన ఈ టెన్నిస్ బాల్ టోర్నీలో 32 జట్లు పాల్గొన్నాయి. సెమీస్ లో వనపర్తి రైజర్స్ పై ఏదుట్ల, పెద్దమందడిపై పెబ్బేరు జట్లు గెలిచి ఫైనల్ కు చేరాయి. ఫైనల్ లో ఏదుట్లపై పెబ్బేరు విజయం సాధించింది. ముఖ్య అతిథులు బీజేపీ నాయకులు అయ్యంగారి ప్రభాకర్ రెడ్డి, మాజీ జడ్పీ చైర్మన్ లోకనాథ్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సిరిసిల్ల సాయినాథ్ విజేత పెబ్బేరు జట్టుకు రూ.40 వేలు, రన్నరప్ ఏదుట్ల జట్టుకు రూ.20 వేల నగదు బహుమతులతో పాటు ట్రోఫీలు అందజేశారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ గా నిలిచిన శ్రీకాంత్ కు రూ.5 వేలు బహుమతి ఇచ్చారు. కార్యక్రమంలో నిర్వహణ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# నాగర్ కర్నూల్ ట్యాంక్ బండ్ పై ముదిరాజ్ ముద్దుబిడ్డ విగ్రహం!

**పండుగ సాయన్న స్ఫూర్తితో ముందుకు సాగాలి**

**ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి**



నాగర్ కర్నూల్, అక్టోబర్ 22 (మనం న్యూస్): బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి పండుగ సాయన్న స్ఫూర్తితో ముందుకు సాగాలని నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి పిలుపునిచ్చారు. నాగర్ కర్నూల్ లోని కేసరి సముద్రం ట్యాంక్ బండ్ పై పండుగ సాయన్న విగ్రహ స్థాపనకు మంగళవారం శంకుస్థాపన చేశారు. మత్స్యకారుల సహకార సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ముదిరాజ్ బిడ్డ అయిన పండుగ సాయన్న బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన మహనీయుడని కొనియాడారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ముదిరాజులకు, బడుగు బలహీన వర్గాలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని, నాగర్ కర్నూల్ ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పండుగ సాయన్న విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తామని, ఆవిష్కరణకు ప్రముఖ నాయకులను ఆహ్వానిస్తామని తెలిపారు. మత్స్యకారుల సంఘానికి అన్ని విధాలా సహకరిస్తానని పేర్కొన్నారు. ఈ శంకుస్థాపన కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కీగల సునీంద్ర, వైస్ చైర్మన్ బాదం రమేష్, మత్స్యకార సంఘం నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యత

**భూ సేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలి**

**రబీలో వరి సాగు చేయవద్దని రైతులకు అవగాహన కల్పించాలి**

**తాగునీటి అవసరాలకు జూరాల నీటిని నిలువ ఉంచాలి**

**జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 22 (మనం బ్యూరో) : సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణాన్ని పూర్తిచేసి, పూర్తిస్థాయి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని జోగులాంబ గద్వాలజిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల భూసేకరణ పై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయా మండలాల పరిధిలో చేపట్టాల్సిన భూసేకరణపై క్షుణ్ణంగా అధికారులతో మాట్లాడారు. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం ప్రారంభమై చాలా ఏళ్లవుతున్నందున భూసేకరణ ఆలస్యం చేయడం తగదని చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. రెవెన్యూ, ఇరిగేషన్, సర్వే శాఖల అధికారులు సమన్వయంతో రోజువారి లక్ష్యాలను నిర్దేశించుకుని భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేసేందుకు ముందుకెళ్లాలన్నారు. అవార్డు పూర్తయిన రైతులకు ఆలస్యం చేయకుండా సకాలంలో డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. జూరాల రిజర్వాయర్ చుట్టుపక్కల పొలాలు ఉన్న రైతులు రబీలో వరి సాగు చేయకుండా ముందుగానే గ్రామసభలు నిర్వహించి క్షేత్రస్థాయిలో అవగాహన కలిగించాలన్నారు. అనధికారికంగా మోటర్లు పెట్టి నీళ్లు పారించుకునే వారిపై తగు చర్యలు తీసుకుంటామన్నారు. వేసవిలో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని జూరాల రిజర్వాయర్లో తగినంత నీటిని నిలువ చేసుకోవాల్సి ఉందని పేర్కొన్నారు. రబీలో రైతులు ఎట్టి పరిస్థితుల్లో వరి సాగు చేయవద్దని సూచించారు. తమ బోర్లు, బావుల్లో నీటి లభ్యత ఆధారంగా ఆరుతడి పంటలు సాగు చేయవచ్చని ఈ సందర్భంగా కలెక్టర్ తెలియజేశారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మధుమోహన్, భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, ఆర్డీవో శ్రీనివాసరావు, సర్వే ఏడి నూకరాజు, ఇరిగేషన్ ఈఈ లు శ్రీనివాసులు, సంజీవ్ ప్రసాద్, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# అణగారిన వర్గాల ఆశాజ్యోతి పండుగ సాయన్న

**పండుగ సాయన్న జయంతిలో అదనపు కలెక్టర్ మధుమోహన్**

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 22 (మనం బ్యూరో) : భూస్వాముల దోపిడీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం చేసి, అణగారిన వర్గాల ఆశాజ్యోతిగా పండుగ సాయన్న నిలిచారని జోగులాంబ గద్వాల జిల్లా అదనపు కలెక్టర్ మధుమోహన్ అన్నారు. గురువారం తెలంగాణ పోరాట యోధుడు పండుగ సాయన్న జయంతి సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఐడిఓసి ఆవరణలో అధికారికంగా కార్యక్రమం నిర్వహించారు. పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, తెలుగు ముదిరాజ్ సంఘం నేతలు సాయన్న చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ... బుర్రకథలు, జానపద పాటల ద్వారా పలువురు కళాకారులు సాయన్న జీవితాన్ని వెలుగులోకి తీసుకొచ్చారన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ఇలాంటి వీరుల జయంతి కార్యక్రమాలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం గర్వకారణమన్నారు. సాయన్న లాంటి మహనీయుల జీవిత కథలు ఆదర్శంగా నిలుస్తాయన్నారు. బహుజనులకు న్యాయం జరిగేందుకు చేసిన వీరి పోరాటం స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ జయలక్ష్మి, పలువురు కౌన్సిలర్లు, తెలుగు ముదిరాజ్ సంఘం నేతలు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



# ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

**ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య మరింత పెంచే దిశగా ముందుకెళ్లాలి**

**గర్భిణుల ఆరోగ్యం, రోగుల వైద్య సేవలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి**

**వైద్య సిబ్బంది సమయపాలన తప్పక పాటించాలి**

**మల్దకల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**




ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 22 (మనం బ్యూరో) : ప్రభుత్వ ఆసుపత్రుల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వైద్య శాఖ అధికారులకు ఆదేశించారు. గురువారం మల్దకల్ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్రంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలు తదితర విషయాలపై వైద్య సిబ్బందిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ఆసుపత్రికి వచ్చే ఔట్ పేషెంట్లకు పూర్తిస్థాయిలో మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రిలో వైద్యులు, వైద్య సిబ్బంది సమయపాలన పాటిస్తూ విధులకు క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో సహజ ప్రసవాల సంఖ్య పెంచేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. హై రిస్క్ గర్భిణీలను ముందుగానే గుర్తించి, తగిన వైద్య జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గర్భిణీ స్త్రీల ఏ.ఎన్.సి.రిజిస్ట్రేషన్, చెక్ అప్ వంద శాతం జరిగేలా చూడాలన్నారు. సుపత్రిలోని అన్ని రిజిస్టర్లు సక్రమంగా నిర్వహించాలన్నారు. వర్షకాలంలో ఎలాంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రక్త, మూత్ర పరీక్షలు, ఇతర పరీక్షలను వేగంగా పూర్తి చేసి తక్షణ రోగ నిర్ధయం చేయాలన్నారు. అవసరమైన మందులు ఎప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వైద్యులకు సూచించారు. కుక్క కాటు, పాము కాటు బాధితులకు తక్షణ వైద్య సేవలు అందించేలా అవసరమైన మందులు, వ్యాక్సిన్లు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లోపల, బయట పరిశుభ్రతను నిరంతరం పాటిస్తూ, రోగులకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలన్నారు. గర్భిణీ స్త్రీల కోసం ఏర్పాటు చేస్తున్న యోగా కేంద్రం భవన నిర్మాణం పనులు వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి కృషి చేయాలన్నారు. వైద్య అధికారులు, సిబ్బంది తమ విధులను సమర్థవంతంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వరూప రాణి, వైద్య సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# అలంపూర్ లో ఘనంగా స్వేరోస్ కార్యక్రమం

**అక్షరం, ఆరోగ్యం, ఆర్థికం, ఆత్మగౌరవం, అధికారం లక్ష్యంగా ముందుకు సాగుతూ స్వేరోస్**



ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 22 (మనం బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ లో గురువారం స్వేరోస్ డే కార్యక్రమం ఘనంగా నిర్వహించుకోవడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని మండల ఇన్చార్జి, మాజీ జిల్లా అధ్యక్షుడు వేమన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ఎస్సార్ శంకరం గురుకులాలకు చేసిన ఘనత అదేవిధంగా డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ లు గురుకులాల సెక్రటరీగా కొనసాగినప్పుడు అన్న గారిని వర్గాల విద్యార్థుల కోసం అనేకశీగా కృషి చేశారన్నారు. డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అందించిన ప్రోత్సాహం వల్ల విద్యార్థులు ఎన్నో ఉన్నతమైన శిఖరాలు అవరోధించారని ఆయన కొనియాడారు. స్వేరో సీనియర్ నాయకుడు, టిజిపిఎ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బొంకూరు మహేష్ మాట్లాడుతూ.... ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రోత్సాహం వల్లే అగ్గిపెట్టె కోసమే మూడు కిలోమీటర్లు నడిచి వెళ్ళే గ్రామంలో పుట్టిన పిల్లలు, ఎర్ర బస్సు ఎరగని పిల్లలకు ఎవరెస్టు శిఖరం పైకి పంపించిన ఘనత ఆయనదేనని ఈ సందర్భంగా చెప్పుకొచ్చారు. గురుకులాల విద్యార్థులు ప్రపంచస్థాయిగా గుర్తింపు పొంది ఎవరెస్ట్ శిఖరం పైకి పంపి ప్రపంచంలో చరిత్ర సృష్టించిన వ్యక్తి ఆయన అన్నారు. సంకల్పం ఉంటే ఎంతటి దానైనా ఛేదించవచ్చని విషయాన్ని విద్యార్థులకు నూరు పోశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అలంపూర్ మండల ఇన్చార్జి మాజీ అధ్యక్షుడు వేమన స్వేరో గీతం ప్రారంభించి, పీట్ ఇండియా ఫౌండేషన్ రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి కనకం బాబు స్వేరో పది అజ్ఞాలతో కార్యక్రమం ముగింపు పలకడం జరిగిందన్నారు. అలంపూర్ లో స్వేరోస్ సంస్థను మరింత బలోపేతం చేయడం తో పాటు క్షేత్రస్థాయిలో సమస్త కలపాలను విస్తృతం చేయడం కోసం కీలక నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ స్వేరో సురేష్, యామిని సుంకన్న, నాగరాజు, దేశపోగు బాబు, ఏసోబు, రాజేష్, ప్రవీణ్, మద్దిలేటిలతోపాటు తదితరులు పాల్గొన్నారు.

# యూసీసీ రాజ్యాంగ హక్కులకు వ్యతిరేకం

**మూలవాసి మైనారిటీ హక్కులను కాలరాసే ఉద్దేశం**



**హనీఫ్ అహ్మద్**

మహబూబ్ నగర్, 22అక్టోబర్, (మనం న్యూస్) : భారతదేశం విభిన్న సంస్కృతులు, ఆచారాలు మరియు ప్రతి 100 కిలోమీటర్లకు మారే వేల భాషల సమాహారం. స్వాతంత్ర్య సమయంలో 565కు పైగా సంస్థానాలు, నాగాలాండ్, త్రిపుర ప్రాంతాలు తమ విశ్వాసాలు, హక్కులకు భంగం వాటిల్లదనే నమ్మకంతోనే యూనియన్‌లో విలీనమయ్యాయి. మన రాజ్యాంగం ఆర్టికల్ 19(1)(ఞ) ద్వారా భావప్రకటన స్వేచ్ఛను, ఆర్టికల్ 25 ద్వారా మత స్వేచ్ఛను, ఆర్టికల్ 29, 30 ద్వారా ముస్లింలు, క్రైస్తవులు, పార్సీలు, బుద్ధిస్టులు, ఆదివాసులు, గిరిజనులు మరియు ఇతర మైనారిటీల సాంస్కృతిక, విద్యా హక్కులను కాపాడిందని సామాజిక వేత్త, తెలంగాణ ఉద్యమకారుడు హనీఫ్ అహ్మద్ తెలిపారు. దేశంలో సివిల్, క్రిమినల్ చట్టాలు అందరికీ సమానమే. ఆచారాల విషయానికొస్తే ముస్లింలకే గాక హిందూ పర్సనల్ లా, క్రైస్తవ, పార్సీ, బుద్ధిస్ట్ చట్టాల ద్వారా అందరి విశ్వాసాలకూ రాజ్యాంగంలో వెసులుబాటు ఉందంటే ఈ ప్రత్యేక చట్టాలను రద్దు చేయాల్సిన పనిలేదు. అయితే ఉత్తరాఖండ్, గుజరాత్, అస్సాం, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఉమ్మడి పౌర స్మృతిని బలవంతంగా అసెంబ్లీలలో పాస్ చేసి రుద్దుతున్నారని, కేంద్రం కూడా మిగతా రాష్ట్రాలపై దీన్ని రుద్దాలని చూస్తోందని హనీఫ్ అహ్మద్ విమర్శించారు . మైనారిటీల హక్కులను దెబ్బతీసే ఈ చర్యలు మరియు నిచ్చెనమెట్ల వ్యవస్థ ఆధిపత్యాన్ని కొనసాగించాలనుకోవడం ఫెడరలిజానికి, లౌకికత్వానికి, మానవత్వానికి మరియు రాజ్యాంగానికి పూర్తిగా వ్యతిరేకమని పేర్కొన్నారు.బయట నుండి వచ్చిన ఆర్యన్లు, మనువాదులు మతం పేరుతో రాజకీయం చేస్తూ మత మనువాదాన్ని స్థాపించడానికి మూలవాసులపై కుట్రలు చేస్తున్నారని హనీఫ్ అహ్మద్ మండిపడ్డారు. తమ మతమే దేశభక్తి అని, మూలవాసులైన మిగతా మతాలు, తెగలు, కులాలకు దేశభక్తి లేదనే విషప్రచారంతో స్వదేశీ పౌరులనే పరాయివారుగా చిత్రించడం, కొద్దిమంది కార్పొరేట్ల కోసం దేశ వనరులను ధారాదత్తం చేయడం, ఈవీఎంలపై అనుమానాలు, చివరికి లా కమిషన్, ప్రభుత్వ రంగాలు, రాజ్యాంగ వ్యవస్థల స్వయంప్రతిపత్తిని దెబ్బతీస్తూ తమ గుప్పిట్లో పెట్టుకోవడం ప్రపంచం ముందు మన దేశాన్ని సిగ్గుతో తలదించుకునేలా చేస్తున్నాయని స్పష్టం చేశారు. ఈ ప్రమాదాన్ని గుర్తించి బలవంతపు ఏకపక్ష నిర్ణయాలను పక్కనపెట్టి, రాజ్యాంగ లౌకిక నిర్మాణాన్ని, మూలవాసుల హక్కులను కాపాడటానికి ప్రభుత్వాలు, రాజకీయ పక్షాలు, మేధావులు, సామాజిక కార్యకర్తలు, యువత మరియు ప్రజలందరూ ఐక్యంగా పోరాడాలని సామాజిక వేత్త, తెలంగాణ ఉద్యమకారుడు హనీఫ్ అహ్మద్ పిలుపునిచ్చారు.

**ఎన్ఎంఎంఎస్ పరీక్షకు విద్యార్థులకు**

# ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభం

**గొల్లపల్లి లలితాంబికా తపోవనంలో 10 రోజుల పాటు శిక్షణ**

మహబూబ్‌నగర్, 22అక్టోబర్, (మనం న్యూస్ ) : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించే లక్ష్యంతో ప్రత్యేక శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం గొల్లపల్లిలోని లలితాంబికా తపోవనం వద్ద గురువారం ఈ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. పది రోజుల పాటు నిర్వహించనున్న ఈ ప్రత్యేక శిక్షణ తరగతుల్లో అనుభవజ్ఞులైన అధ్యాపకుల బృందం విద్యార్థులకు వివిధ అంశాలపై నాణ్యమైన శిక్షణ అందించనుంది. విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరిచి స్కాలర్‌షిప్‌లు సాధించేలా ప్రత్యేక ప్రణాళికతో బోధన చేపట్టనున్నారు. శిక్షణలో పాల్గొనే విద్యార్థులకు రెసిడెన్షియల్ తరహాలో ప్రత్యేక వసతులు కల్పిస్తున్నట్లు మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, వందేమాతరం ఫౌండేషన్ సమన్వయకర్త రవీందర్ రెడ్డి తెలిపారు. విద్యార్థులకు చదువుకు అనుకూలమైన వాతావరణం కల్పిస్తూ, పరీక్షల్లో విజయానికి అవసరమైన మార్గదర్శకత్వం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సహాయ సహకారాలు అందిస్తున్నారని వారు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీసి, వారికి ఉన్నత విద్యావకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు వివరించారు.



# జిల్లా వ్యాప్తంగా పండుగ సాయన్న జయంతి ఉత్సవాలు

**అన్ని వర్గాల నాయకులు పండుగ సాయన్నకు నివాళ్లు లు**

**పండుగ సాయన్న ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి**

**పండుగ సాయన్న ధైర్యం, పేదలకు అండ**



మహబూబ్ నగర్, 22అక్టోబర్, (మనం న్యూస్) : ఆపదలో ఆదుకోవడం, అన్నార్తుల ఆకలి తీర్చడమే తెలంగాణ ప్రజా వీరుడు పండుగ సాయన్న ప్రధాన ఆశయమని ప్రముఖ న్యాయవాది బెక్కం జనార్ధన్, తెలంగాణ రాష్ట్ర మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు పెద్ద విజయ్ కుమార్,ముదిరాజ్ పండుగ సాయన్న సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు కృష్ణ ముదిరాజ్ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మెట్లకాడ ప్రభాకర్ పేర్కొన్నారు. తెలంగాణ రాబిన్‌హుడ్‌గా ఖ్యాతిగాంచిన పండుగ సాయన్న 174వ అధికారిక జయంతి వేడుకలను పురస్కరించుకుని గురువారం మహబూబ్ నగర్ పట్టణంలోని తెలంగాణ చౌరస్తా వద్ద ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు.జిల్లా లో అన్ని మండలాల, గ్రామాలలో లో పెద్ద ఎత్తున పండుగ సాయన్న జయంతి ఉత్సవాలు పార్టీల కతీతంగా పాల్గొని నివాళ్లు అర్పించారు.ఆయన చేసిన పేదలకు సహాయపడిన అంశాలను కొనియాడారు. భూస్వాములకు ఎదురుగా నిలిచి పేదలకు సహాయం చేసిన గొప్ప వీరుడుగా కొనియాడారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులు ఆనందరావు తదితరులు మాట్లాడుతూ నిజాం పాలనలో, దొరల అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన సాయన్న జీవితం ఎందరికో స్ఫూర్తిదాయకమన్నారు. ఆపదలో ఉన్న వారికి, అసహాయులకు, పేదలకు సహాయం చేయడమే ఆయన నమ్మిన సిద్ధాంతమని కొనియాడారు. నేటి సమాజంలోనూ పేదలపై జరుగుతున్న అణచివేతలను ఎదుర్కొనేందుకు, పండుగ సాయన్న పోరాట స్ఫూర్తిని, ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన అవసరం నేటి తరానికి ఎంతో ఉందని వక్తలు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలు ప్రజా సంఘాల నాయకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాయన్నకు నివాళ్లు అర్పించారు. న్యాయవాదులు తెలుగు నర్సింలు కేపీ లక్ష్మీ నరసింహా పండుగ సాయన్న ముని మనుమడు పండుగ నరసింహులు రజక సంఘం జిల్లా అధ్యక్షులు శివ అశోక్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు



# సందళ్ళ ముగింపు.. చదువుల ఆరంభం

**తరగతులకు..వేళాయే**

ఊరుకొండ అక్టోబర్ 22 (మనం న్యూస్) : స్థానిక మండల పరిధివ్యాప్తంగా నేడు దసరా సెలవులు ముగిసాయి.గురువారం తరగతి లకు వేళాయే,విజయదశమి వేడుకల కోలాహలం ముగిసింది.పిండివంటల ఘుమఘుమలు,అమ్మమ్మల ఇండ్ల ముచ్చట్లు,బంధుమిత్రుల సందడులతో ఇన్నాళ్లు ఇల్లకాల్లా ఎగిరి గంతేసిన బాల్యానికి ఇప్పుడు సరికొత్త గమ్యం గుర్తొచ్చింది.ఊరూ వాడా జరుపుకున్న ఉత్సవాల ఉత్సాహాన్ని మూటగట్టుకుని,విద్యార్థి లోకం మళ్లీ బడి బాట పడుతోంది.సెలవుల సరదాల నుంచి చదువుల సాలీనా ప్రయాణానికి వేళయింది.సందళ్ల ముగింపు.చదువుల ఆరంభం అలాయ్ బలాయ్‌ల ఆలింగనాలు,జమ్మి ఆకుల దీవెనలు,రావణ దహన రంజితాలు.ఇలా దసరా పండుగ తెచ్చిన ప్రతి జ్ఞాపకం మదిలో మెదులుతుండగానే బడి గంట మోగింది.ఇన్నాళ్లు పుస్తకాలను పక్కనబెట్టి,ఆటల తోటలో విహరించిన చిన్నారులు.ఇప్పుడు సరికొత్త ఉత్సాహంతో తరగతి గదుల్లోకి అడుగుపెడుతున్నారు. పల్లెటూరి పచ్చదనాన్ని,అమ్మమ్మ ప్రేమల మధురిమలను మనసు నిండా నింపుకుని నగరాల వైపు,పాఠశాలల వైపు పయనమవుతున్నారు.తరగతి గదులన్నీ మళ్లీ కిలకిలరాగాలతో,స్నేహితుల పలకరింపులతో కళకళలాడనున్నాయి.అక్షరాల పండగకు స్వాగతం.పండుగ సెలవులు ముగిసినా,చదువుల పండుగ ఇప్పుడే మొదలవుతోంది. జ్ఞానాన్ని సముపార్జించే ఈ పవిత్ర ప్రయాణంలో విద్యార్థులంతా సరికొత్త సంకల్పంతో ముందుకు సాగాలి.శరదృతువు తెచ్చిన ప్రశాంతతతో,సెలవులు ఇచ్చిన విశ్రాంతితో మెదళ్లకు పదును పెట్టాల్సిన సమయమిది.పుస్తకాలే హస్తభూషణాలుగా,క్రమశిక్షణే ఆభరణంగా విద్యార్థులు తమ విద్యా కుసుమాలను వికసింపజేయాలి.ఉపాధ్యాయులకు,తల్లిదండ్రులకు అభినందనలు సెలవుల తర్వాత బడికి వచ్చే పిల్లలను ఆదరంగా ఆహ్వానించేందుకు ఉపాధ్యాయ లోకం సిద్ధమైంది.కేవలం పాఠాలు చెప్పడమే కాకుండా,పండుగ అనుభవాలను పంచుకుంటూ పిల్లల్లో చదువుపై ఆసక్తిని పెంచేలా తరగతులను డిజైన్ చేయడంలో మన గురువుల పాత్ర అభినందనీయం.తల్లిదండ్రులు కూడా పిల్లలను మళ్లీ చదువుల బాటలో గాడిలో పెట్టేందుకు తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తున్నారు.ప్రియమైన విద్యార్థులారా.సెలవుల సరదాలు ముగిశాయి,చదువుల వేళయింది.ఆటల,పాటల సందడిని జ్ఞాన సాధన వైపు మళ్లించండి.మీ కలలను నిజం చేసుకునేందుకు,తరగతి గది వైపు అడుగులు వేయండి.సరికొత్త ఉత్సాహంతో,రెట్టింపు నమ్మకంతో విద్యా సంవత్సరాన్ని విజయవంతం చేయాలని ఆకాంక్షిస్తూ,అందరికీ విద్యా స్వాగతం.

# మీరు చేసే నేత్రదానం ఇద్దరి జీవితాలను వికసింపచేస్తుంది

**నేత్రదానం చేసేందుకు ముందుకు రండి**

**ఇద్దరికి చూపును ప్రసాదించి ఆదర్శంగా నిలిచిన గుబ్బ గురుస్వామి**



మహబూబ్ నగర్, 22అక్టోబర్, (మనం న్యూస్) : మరణించిన మరోమారు ప్రపంచాన్ని చూసే అద్భుత అవకాశం నేత్రదానం చేయడం వల్లే లభిస్తుందని ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఈ విషయాన్ని పరిగణలోకి తీసుకున్న మహబూబ్‌నగర్, హనుమాన్ పుర వాసి గుబ్బ గురుస్వామి (78) వయోభారంతో మరణించారు. అతని మరణానంతరం నేత్రాలు మరో ఇద్దరికి చూపు ప్రసాదించాలనే ఉద్దేశంతో అతని కళ్ళను దానం చేయడానికి సంకల్పించి వారి కుమారులు గుబ్బ మురళీధర్, గుబ్బ పవన్ మరియు వారి మేనల్లుడు భీమా శ్రీనివాస్, లయన్ అంబటి నటరాజ్ కి సమాచారం అందించారు.ఈ మేరకు లయన్ అంబటి నటరాజ్ మరియు ఎల్ వి ప్రసాద్ కంటి ఆసుపత్రి టెక్నీషియన్ బాలకృష్ణ సత్వరమే స్పందించి ఈరోజు ఉదయం 11:00 గంటలకు 'కార్నియా' ను సేకరించి, కుటుంబ సభ్యులకు ధృవీకరణ పత్రం అందించారు. ఈ సందర్భంగా లయన్ అంబటి నటరాజ్ మాట్లాడుతూ ఇప్పటి వరకు 279 మంది తమ 'కార్నియా' ను దానంచేసి 558 మందికి చూపు కల్పించారని తెలిపారు.అలాగే బాధలో ఉన్నప్పటికి కార్నియా దానానికి ఒప్పుకొన్న గుబ్బ గురుమూర్తి కుటుంబ సభ్యులకు లయన్ అంబటి నటరాజ్ , లయన్ బాబుల్ రెడ్డి లయన్స్ క్లబ్ ఆఫ్ పాలమూరు తరఫున ధన్యవాదాలు తెలిపారు.నేత్రదానం చేయాలనుకునే వారు తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, బాడీ ఆర్గనైజేషన్ డొనేషన్ . అండ్ ఫస్ట్ డిస్ట్రిక్ట్ . గవర్నర్ , లయన్ అంబటి నటరాజ్ (పిడిసి) ని 9666900900 సంప్రదించగలరు.

## తెలంగాణ రాబిన్‌హుడ్ పండుగ సాయన్న జయంతి

**ఎస్పీ డి.జానకి**



మహబూబ్ నగర్, 22అక్టోబర్, (మనం న్యూస్) : తెలంగాణ రాబిన్‌హుడ్‌గా పేరుగాంచిన పండుగ సాయన్న జయంతి సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా జిల్లా ఎస్పీ డి.జానకి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పండుగ సాయన్న ప్రస్తుత మహబూబ్‌నగర్ జిల్లాలోని నవాబ్‌పేట మండలం మెరుగోనిపల్లి గ్రామంలో జన్మించిన పాలమూరు ముద్దుబిడ్డ అని పేర్కొన్నారు. పేదలు, అణగారిన వర్గాల ప్రజల పక్షాన నిలిచి, దోపిడీ, అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడిన ప్రజా వీరుడిగా ఆయన ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని తెలిపారు. సంపన్నుల నుంచి సంపదను సేకరించి పేదలకు పంచిపెట్టిన వ్యక్తిగా ఆయనకు తెలంగాణ రాబిన్‌హుడ్ అనే పేరు వచ్చిందన్నారు. సొంత ప్రాంతమైన పాలమూరు జిల్లాకు చెందిన ఇలాంటి మహనీయుల చరిత్రను భావితరాలకు తెలియజేయడం, వారి ఆశయాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. పేదల సంక్షేమం, సామాజిక న్యాయం పట్ల ఆయన చూపిన నిబద్ధత నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఏఓ రుక్మిణి భాయ్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ మోతీరామ్, ఆర్ఐ అడ్మిన్ కృష్ణయ్య, ఆర్ఎస్ఐలు మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ప్రత్యేక గ్రామసభ

**ప్రతి పొలానికి పంట కుంట, ప్రతి ఇంటికి ఇంకుడు గుంత ఏర్పాటు చేయాలి**

**జడ్పీ సీఈఓ శోభారాణి**



బీబీనగర్: అక్టోబర్22, (మనం న్యూస్) : ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో కరువు తీవ్రత పెరిగే అవకాశం ఉండటంతో, తాగునీటి సమస్యను అధిగమించేందుకు ముందస్తు చర్యలు చేపట్టాలని జడ్పీ సీఈఓ శోభారాణి సూచించారు. గురువారం మండలంలోని ఎర్రబెట్టుతండా గ్రామపంచాయతీలో ఆమె ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి రైతు పొలంలో పంట కుంట, ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి గ్రామంలో ఊట కుంటల ఏర్పాటుతో పాటు భూగర్భ జలాల పెంపునకు అవసరమైన పనులను గుర్తించాలని సూచించారు. వర్షపు నీరు వృథా కాకుండా నిల్వ చేసుకునే చర్యలు చేపట్టాలని, రాబోయే ఎనిమిది నెలల్లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు.





# అధిష్టానం పిలిపిస్తే బీఆర్ఎస్ పార్టీని ముందు వరుసలో తీసుకెళ్తా

**అచ్చంపేట నియోజకవర్గంలో పార్టీ పటిష్ట కోసం విస్తృతంగా పర్యటన**

**ఇప్పటికే నియోజకవర్గ స్థాయిలో బీ ఆర్ యస్ ముఖ్యనేతలతో సంప్రదింపులు**

**బీఆర్ఎస్ పార్టీ గెలిపే నా ధ్యేయం**

**ప్రొఫెసర్ గడదాసు వెంకటేశ్వర్లు**

ఉమ్మడి మహబూబ్ నగర్ అక్టోబర్ 22 (మనం బ్యూరో) : అచ్చంపేట నియోజకవర్గం లో బీఆర్ఎస్ పార్టీకి సరైన నాయకత్వం లేకపోవడం పట్ల పార్టీ ముఖ్య నేతలు, కార్యకర్తలు సరైన నాయకుడి కోసం ఎప్పుడెప్పుడని ఎదురుచూస్తున్నారు. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ తరపున ఎస్సీ వర్గానికి చెందిన ముగ్గురు, నలుగురు ముందుకు వస్తున్నారు. అధిష్టానం పిలిపిస్తే పార్టీ బలోపేతం చేయడానికి ముందుంటామని నాయకులు ముందుకొస్తున్నారు. అదే తరుణంలో మీ ప్రాంత



వాసిని...! మీ బిడ్డను...! పేదరికం నుండి వచ్చిన వాడిని, ఉస్మానియా యూనివర్సిటీలో ప్రొఫెసర్ గా చేస్తున్న మీ వ్యక్తిని అంటూ చాప కింద నీరుల అచ్చంపేట నియోజకవర్గంలో తనకంటూ ఒక కేడర్ నిలబెట్టుకునేందుకు ఇప్పటికే క్షేత్రస్థాయిలో నియోజకవర్గంలో ఉన్న అన్ని మండలాలలో ప్రొఫెసర్ గడదాసు వెంకటేశ్వర్లు విస్తృత పర్యటన చేస్తున్నారు. బీఆర్ఎస్ పార్టీ నుండి అధిష్టానం పిలిపిస్తే అచ్చంపేట నియోజకవర్గంలో గులాబీ జెండా ఎగరవేయడానికి క్షేత్రస్థాయిలో ముఖ్య నేతలను, కార్యకర్తలను, ప్రజలను కలుపుకొని వెళ్తానని ఆయన అంటున్నారు. గురువారం లింగాల మండలంలోని బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలను, మాజీ సర్పంచులను, కార్యకర్తలను కలుస్తూ ముందుకు వెళ్తున్న గడదాసు వెంకటేశ్వర్లుకు పార్టీ నాయకులు పరోక్షంగా సపోర్ట్ చేస్తున్నారు. అధిష్టానం పిలుపు ఇస్తే ఏ నాయకుడి కోసమైన పని చేస్తామని పార్టీ నేతలు చెప్పుకొస్తున్నారు. స్థానికుడు అయితే నియోజకవర్గ సమస్యలు పూర్తిస్థాయిలో తెలుస్తాయని కొంతమంది పార్టీ పెద్దలు, నాయకులు, కార్యకర్తలు చెప్పుకొస్తున్నారు.

ఇదే తరుణంలో ప్రొఫెసర్ గడదాస్ వెంకటేశ్వర్లు విస్తృతంగా బీఆర్ఎస్ పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటికి సిద్ధం అవుతున్నారు. అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇస్తే అచ్చంపేట నియోజకవర్గం లో మరింత దూకుడు పెంచేందుకు గడదాసు వెంకటేశ్వర్లు సిద్ధమవుతున్నారు. నియోజకవర్గం నుండి పార్టీ ముఖ్య నేతలను కలుపుకొని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, అదేవిధంగా నియోజకవర్గ ఇన్చార్జిని కలవడానికి సిద్ధమవుతున్నారు. నియోజకవర్గంలో స్థానిక నాయకుని కోసం పార్టీ శ్రేణులు మరింత ఉత్సాహంతో ఉన్నారు. పార్టీ అధిష్టానం నియోజకవర్గ బాధ్యతలు ఎవరికి అప్పగించిన పార్టీ పటిష్ట కోసం నా వంతు బాధ్యతగా పార్టీ బలోపేతం కోసం మరింత కృషి చేస్తానని ప్రొఫెసర్ గడదాసు వెంకటేశ్వర్లు అన్నారు







# పిడమర్తి నాగార్జున కుటుంబానికి ఆర్థిక భరోసా

ఆత్మకూర్ ఎస్ అక్టోబర్ 22 మనం న్యూస్ : మండల పరిధిలోని తుమ్మల పెన్‌పహాడ్ లో ప్రమాదవశాత్తు మృతి చెందిన పిడమర్తి నాగార్జున కుమార్తె భవిష్యత్తుకు భరోసా కల్పించాలనే ఉద్దేశంతో పలువురు దాతలు, యువజన సంఘాలు, వివిధ సంస్థలు, స్నేహితుల సహకారంతో మొత్తం రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని అందించేలా డిపాజిట్ చేశారు. ఈ క్రమంలో గురువారం నాగార్జున కుమార్తె పేరు మీద సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై) పథకంలో రూ.1,50,000 డిపాజిట్ చేశారు. అలాగే నాగార్జున సతీమణి రేణుక పేరు మీద రూ.50,000ను ఒక సంవత్సరం కాలపరిమితితో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. ఏడాది అనంతరం ఫిక్స్‌డ్ డిపాజిట్ మొత్తాన్ని తీసి సుకన్య సమృద్ధి యోజన ఖాతాలో జమ చేయాలని నిర్ణయించారు. ఈ పథకంలో వార్షిక డిపాజిట్ పరిమితి రూ.1,50,000 కావడంతో ఈ విధంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కష్టకాలంలో నాగార్జున కుటుంబానికి అండగా నిలిచి, ఆయన కుమార్తె భవిష్యత్తుకు ఆర్థిక భద్రత కల్పించేందుకు ముందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



అందరి సహకారం, మానవత్వం, ఐక్యతకు ఈ కార్యక్రమం నిదర్శనంగా నిలిచింది. సహకరించిన వారు: తుమ్మల పెన్‌పహాడ్, నూతనకల్ పదవ తరగతి మిత్రులు, అన్ని యువజన సంఘాలు, బీఆర్ఎస్ పార్టీ గ్రామశాఖ తుమ్మల పెన్‌పహాడ్, జై భీమ్ సోషల్ ఆర్గనైజేషన్, వట్టే జానయ్య యాదవ్, రక్ష ఫౌండేషన్, బీవీ ఫౌండేషన్, పి. లింగరాజు ఎస్ఎల్, ఇతర దాతలు, నాగార్జున కుటుంబ సభ్యులు సహకరించారు.